


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 142 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 27 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :142 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 27 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఎర్రకోటపై మువ్వన్నెల రెపరెపలు



### రిపబ్లిక్ డే పరేడ్ దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక

- గణతంత్ర దినోత్సవ పరేడ్ జాతీయ గర్వానికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు
- పరేడ్ మన ప్రజాస్వామ్య బలాన్ని, వారసత్వ సంపదను చాటిచెప్పిందని ప్రశంస
- వేడుకల అనంతరం సంప్రదాయాన్ని పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచిన ప్రధాని
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన మోదీకి ఘన స్వాగతం
- భారత భద్రతా వ్యవస్థల శక్తిసామర్థ్యాలు అద్భుతమని కొనియాడిన ప్రధాని

వివరాలు 2లో..

- రాష్ట్రపతి బగ్గీలో కర్తవ్యపథ్‌కు ద్రౌపది ముర్ము
- జాతీయ జెండానుఆవిష్కరించిన రాష్ట్రపతి
- 21 గన్ సెల్యూట్ గౌరవ వందనం
- ప్రత్యేక ఆకర్షణగా మోదీ తలపాగా






## కలిసికట్టుగా పనిచేస్తే దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరి

- ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన లూథరన్ చర్చిని ప్రారంభించిన మంత్రి
- దేవుడు పెట్టే పరీక్షలను జయించే శక్తిని కూడా ఇస్తాడని ఉద్బోధ
- కులమతాలకు అతీతంగా ఐక్యంగా పనిచేసి అభివృద్ధి సాధిద్దామన్న లోకేశ్
- కష్టాల్లో ఉన్న తోటివారికి అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందని వ్యాఖ్య

అందరూ ఐక్యంగా, కలిసికట్టుగా పనిచేస్తే మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోవచ్చని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సోమవారం నాడు మంగళగిరి పట్టణంలోని ఆత్మకూరులో ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం

- మిగతా 2లో



## భారత్‌తో మాది చారిత్రక బంధం

### రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్

- భారత రిపబ్లిక్ డే
- ప్రపంచంలోనే పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్యాల మధ్య చారిత్రక బంధం ఉందన్న ట్రంప్
- భారతీయులకు విషెస్ చెప్పిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో
- ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళతామని వెల్లడి

- మిగతా 2లో



## భారత్, ఈయూ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం..

### తగ్గనున్న కార్ల ధరలు!

- విజయవంతమైన భారత్ ప్రపంచానికి ఎంతో మేలు చేస్తుందన్న ఈయూ అధ్యక్షురాలు
- భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధం
- ఈ ఒప్పందంతో 200 కోట్ల మందితో అతిపెద్ద మార్కెట్ ఏర్పాటు
- యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలు భారీగా తగ్గే అవకాశం

- మిగతా 2లో



## అమరావతిలో తొలిసారి గణతంత్ర దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్

- భద్రతా దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్
- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందన్న అబ్దుల్ నజీర్
- 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడి

చరిత్రలో తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గణతంత్ర దిన వేడుకలను నిర్వహించారు. హైకోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరేడ్ మైదానంలో జరిగిన ఈ వేడుకలు ప్రభుత్వ ప్రతిష్ఠను చాటేలా సాగాయి. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అధికారిక గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు, అధికారులు హాజరయ్యారు. ఇండియన్ ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, కర్నూల్ ఏపీఎస్పీ రెండో బెటాలియన్ సహా వివిధ భద్రతా దళాలు గవర్నర్‌కు గౌరవ వందనం అందించాయి.

వివరాలు 2లో..



## అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకలు అద్భుతం



- ఈ వేడుకలు రాష్ట్ర భవిష్యత్ లక్ష్యాలకు అద్దం పట్టాయన్న పవన్
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి విశ్వనగరం అవుతుందని ఆకాంక్ష
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన ఉంటుందని హామీ

- మిగతా 2లో


## విజయవాడ లోక్ భవన్ లో 'ఎట్ హోం'... హాజరైన చంద్రబాబు, పవన్, లోకేశ్

- గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఆధ్వర్యంలో 'ఎట్ హోమ్'
- వివిధ రంగాల ప్రముఖులు, స్వాతంత్య్ర సమరయోధులతో సందడిగా లోక్ భవన్
- ఆత్మీయ పలకరింపులతో ఆహ్లాదకరంగా సాగిన కార్యక్రమం
- కట్టుదిట్టమైన భద్రత నడుమ ఘనంగా ముగిసిన తేనీటి విందు

- మిగతా 2లో



## బీసీ కార్డు వాడినంత మాత్రాన అమాయకుడైపోతాడా?



### జోగి రమేశ్ పై వాసంశెట్టి ఫైర్

- కల్తీ మద్యం కేసులో బెయిల్ పై విడుదలైన జోగి రమేశ్
- ఏ ప్రమాణానికైనా సిద్ధమన్న రమేశ్
- అడ్డంగా దొరికిపోయి దొంగ ప్రమాణాలు చేస్తే ఎలాగన్న వాసంశెట్టి

- మిగతా 2లో



## చిన్నారి ప్రాణాలు తీసిన చైనా మాంజా

- కూకట్‌పల్లిలో మాంజా కారణంగా ఐదేళ్ల బాలిక మృతి
- ఇద్దరు కుమార్తెలతో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఘటన
- బాలిక మెడకు చుట్టుకుని కిందపడి అక్కడికక్కడే మృతి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## బహుముఖ ప్రజ్ఞాశాలి పోతుకూచి

పోతుకూచి సాంబశివరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. పద్య వచన గేయ కవిగా, రచయితగా, న్యాయవాదిగా, అనువాదకునిగా, పత్రికా రచయితగా, నటునిగా, నాటక కర్తగా, లఘు కవితా ప్రక్రియ ప్రారంభకునిగా, సాహితీ సంస్థల వ్యవస్థాపక బాధ్యునిగా, మహా సభల నిర్వాహకునిగా, జర్నలిస్టుగా, సంపాదకునిగా...ఇలా చెప్పుకుంటూ పోతే...అసమాన ప్రతిభ కనబరిచి, బహుముఖీన, అగణిత సేవలు అందించిన ప్రతిభా శాలి ఆయన. తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు గ్రామంలో పోతుకూచి నరసింహమూర్తి, సూరమ్మ దంపతులకు 1927, జనవరి 27వ తేదీన జన్మించాడు. ప్రాథమిక విద్య కోటిపల్లి, ఆలమూరు గ్రామాలలో, ఉన్నత పాఠశాల విద్య రామచంద్ర పురంలో, కళాశాల విద్య కాకినాడలో చదివాడు. హైదరాబాదులో ఎల్.ఎల్.బి. చదివి న్యాయవాదిగా వృత్తిని కొనసాగించాడు. కథా రచయితగా దాదాపు 350 కథలు వ్రాశాడు. అయన కథలు ఆంధ్రపత్రిక, కిన్నెర, యువ, ఆంధ్రప్రభ, పుస్తకం, కృష్ణాపత్రిక, ఆంధ్రప్రదేశ్, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, అనామిక, చిత్రగుప్త, భారతి, తెలుగు స్వతంత్ర మొదలైన పత్రికలలో ప్రచురింప బడ్డాయి. ఈ కథలు సాంబశివరావు కథలు (6 సంపుటాలు), శేఖరం కథలు, ఏడుప్రశ్నలు, కొత్త విలువల బ్రతుకు, పోతుకూచి కథలు, ఎదురు ప్రశ్నలు, నవకథంబం, మందారాలు, విక్రమ, వేదప్రియ, హైదరాబాదులో, బ్రతుకుల పతనం పేర్లతో పుస్తక రూపంలో వెలువడ్డాయి. అయన కథలు హిందీ, కన్నడ, తమిళ, రష్యన్, జర్మనీ, ఆంగ్ల భాషల్లోకి అనువదించ బడ్డాయి. ఇతని కథలపై చలం ప్రభావం కనిపిస్తుంది. అయన ఐదు నవలలు వ్రాశాడు. "అన్వేషణ" నవలకు మద్రాసు తెలుగు భాషాసమితి నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. ఆధునికాంధ్రుల సాంఘిక జీవితాన్ని ఈ నవల చక్కగా చిత్రించింది. దీనిని మద్రాసు విశ్వవిద్యాలయం బి.ఎ.లో "ఉపవాచకం"గా నిర్ణయించింది. "ఉదయ కిరణాలు" నవల 1956లో ఆంధ్ర సచిత్రవార పత్రిక నడిపిన పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ నవల 1967లో రష్యన్ భాషలోకి అనువదించ బడింది. ఏడురోజుల మజిలీ శృంగార రసప్రధానమైన నవల. చలమయ్య షష్టిపూర్తి, నీరజ ఆయన ఇతర నవలలు. పోతుకూచి సాంబశివరావు స్వయంగా నటుడు. నాటకకర్త కూడా. అయన వ్రాసిన హంతకులు నాటకం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిచే ఉత్తమ నాటకంగా ఎంపిక కాబడింది. "పల్లె కదిలింది" నాటకం ఆంధ్రదేశం నలుమూలలా ప్రదర్శించ బడింది. దొంగ–దొర, ఇదీ తంతు, ఏడు సున్నాలు, ప్రతి ధ్వనులు, పెళ్ళి పిలుపు, రెండు నాలికలు, అద్దెకొంపలో ఒక నెల, ఒన్ టూ త్రీ ఫోర్, ఏం ప్రేమలో ఏం గొడవలో, అంతరించే అంతరాలు, దీన్ దయాళ్‌గారి దేవుడిలో, సరిహద్దుల్లో, చుట్టాల రభస, అంత్య క్రియలు మొదలైనవి ఇతడు వ్రాసిన ప్రసిద్ధమైన నాటకాలు/నాటికలలో కొన్ని. ప్రతిధ్వనులు అనే నాటికల సంపుటి ప్రచురించాడు. పద్యకవిగా, వచనకవిగా, గేయకవిగా ప్రసిద్ధుడైనాడు. మొదటి పద్య రచన కాలేజీ పోటీలలో బహుమతి గెలుచుకొంది. రాసి-సిరా, అనురాగం – అను – రాగం, సాంబశివానందలహరి, పోతుకూచీయం, శిఖరాలు, అగ్నినాదాలు, చైతన్య కిరణాలు మొదలైన కవితా సంపుటాలు పదికి పైగా వెలువరించాడు. అనేక కవితా సంకలానాల్లో, కవి సమ్మేళనాల్లో ఆయన పాల్గొన్నాడు. అనేక పత్రికల్లో కవితలు వెలువడ్డాయి. ఇతర భాషా సాహిత్య కవితలను తెలుగులోనికి అనువాదం చేశాడు. చుక్కలు అన్న నూతన "లఘు కవితా ప్రక్రియ"ను ప్రారంభించిన గొప్పతనం ఆయనదే. అనువాదకుడిగా గొప్ప కృషి చేశాడు.ఆలిండియా రేడియో నిర్వహించిన "జాతీయ కవి సమ్మేళనం", గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన కవి సమ్మేళనాలలోని ఆంగ్ల కవితలు, కొంకణి, కన్నడ, ఒరియా, మరాఠీ, హిందీ, నేపాలీ కవితలు అనేకం తెలుగులోకి అనువదించాడు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన "ఆలిండియా అనువాదకుల వర్క్‌షాప్"లో ప్రముఖ పాత్ర వహించాడు. దక్షిణ భారత భాషలకు సంబంధించి సాహిత్య అకాడమీ నిర్వహించిన అనువాదకుల వర్క్‌షాప్‌లలో కూడా పోతుకూచి ప్రముఖంగా నిలిచాడు. అమెరికా రీజనల్ ఆఫీస్ (మద్రాస్) వారికి సంబంధించిన 'వాట్ డూ యు నో అబౌట్ లేబర్' అన్న పుస్తకాన్ని తెలుగులోనికి అనువాదం చేశాడు. నేషనల్ బుక్‌ట్రస్ట్ వారి ఆంగ్ల బాల సాహిత్యాన్ని ఎక్కువ శాతం మేరకు తెలుగు లోకి అనువాదం చేసిన ఘనత ఆయనదే. కన్నడ రచయిత సి.కె.నాగరాజారావు రాసిన ప్రముఖ కన్నడ నాటకం 'సంకోలు బసవన్న' కూడా ఆంధ్రీకరించాడు. హిందీ భాషలో భీమసేన్ నిర్మల్ వ్రాసిన 'హిందీకి- అచ్ఛీ- కహా నియా'కు అనువాదం వెలువరించాడు. వచన కవితా రీతులను అనువాదాలతో సహా 1977లో ప్రచురించాడు. సాంబశివరావు కార్యక్రమాల నిర్వాహకుని గా పేరు తెచ్చుకున్నాడు.

హైదరాబాదు సాహిత్య సంస్థ నిర్మాణ దక్షుడిగానే కాకుండా "నవ్య సాహితీ సమితి, ఆంధ్ర విశ్వసాహితి" అనే సంస్థలను నెల కొల్పాడు. "అఖిల భారత తెలుగు రచయితల మహాసభ"లను తొలిసారిగా 1960లో హైదరాబాదులో, 1963లో రాజమండ్రిలోన, 1967లో తిరుపతి, 1969,1971లలో తిరిగి హైదరాబాదులోను ఘనంగా నిర్వహించాడు. 1965లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలు హైదరాబాదులో నిర్వహించాడు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు కార్యదర్శిగా పనిచేసి ఆసంస్థ వజ్రోత్సవాలు విజయ వంతంగా నడిపాడు. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులలో ఒకడిగా ఉన్నాడు. ఇతనికి ఇతర సాహిత్య సంస్థలతో సంబంధాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడెమీ సభ్యుడిగా, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం సలహా సంఘ సభ్యుడిగా, ఆంధ్ర మహిళాసభ సాహిత్య నిర్వాహక మండలిలో సభ్యునిగా, కేంద్ర సాహిత్య అకాడెమీ సలహా సంఘ సభ్యుడిగా సేవలను అందించాడు. 1959లో బరోడాలో జరిగిన అఖిల భారత రచయితల మహాసభలలో పాల్గొన్నాడు. 1961లో మద్రాసులో యునెస్కో ఏర్పాటు చేసిన సదస్సులో దక్షిణ భారతదేశం తరపున పాల్గొన్నాడు. మారిషస్ దీవులలోని ఆంధ్రుల గురించి తెలుసు కోవడానికి, వారితో సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పడానికి మారిషస్ సందర్శించాడు. సంపాదకునిగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర వేశాడు. విశ్వరచన, విశ్వ, యూనిలిట్ మొదలైన పత్రికలను నడిపాడు. యువ కవులను, రచయితలను ప్రోత్సహించాడు. దక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రికలో 'ది తెలుగు వరల్డ్' అనే శీర్షికతో తెలుగు సంస్కృతి సాహిత్యాలపై అనేక వ్యాసాలు వ్రాశాడు. ఆంధ్రప్రతిక (దినపత్రిక) లో 'న్యాయం', 'చట్టం' గురించి సామాన్యులకు అర్థమయ్యేలా అందరికీ న్యాయం అనే శీర్షికతో పలు వ్యాసాలు వ్రాశాడు. ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ ప్రచురించే నాట్యకళ మాస పత్రికకు సహాయ సంపాదకత్వం వహించాడు. ఏ.పి.టైమ్స్ ఆంగ్ల పత్రికలో దాదాపు సంవత్సరం పైగా వివిధ సాహిత్య విషయాలు, సభలు, సమావేశాలు గురించి రిపోర్టింగ్ చేశాడు. 'సిటిజన్స్ ఈవినింగ్' అనే పత్రిక ద్వారా వారం వారం జ్యోతిష ఫలితాలు ఆంగ్లంలో ప్రచురించాడు.

## విజయవాడ లోక్ భవన్ లో 'ఎట్ హోం'... హాజరైన చంద్రబాబు, పవన్, లోకేశ్

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సాంప్రదాయ తేనీటి విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాజ్యాంగ అధిపతులు, పరిపాలన, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖులు ఒకేచోట చేరడంతో ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమం ప్రారంభంలో పోలీస్ బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించగా, ఆహూతులందరూ గౌరవ వందనం సమర్పించారు. ఈ వేడుకలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పలువురు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేదికపై నుంచి కిందకు వచ్చి ఇతర అతిథులతో కలిసిపోయారు. స్వాతంత్ర్య సమరయోధులతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పద్మ పురస్కార గ్రహీతలు, కళాకారులు, క్రీడాకారులతో ఆత్మీయంగా పలకరించారు. నేతల మధ్య సరదా సంభాషణలతో లోక్ భవన్ ప్రాంగణమంతా ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా లోక్ భవన్‌ను విద్యుత్ దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న అధిపతులంతా ఒకేచోట చేరిన ఈ కార్యక్రమం, రాష్ట్రంలో పరిపాలన సామరస్యాన్ని ప్రతిబింబించింది. గత ఏడాది కాలంలో రాష్ట్రం సాధించిన ప్రగతి, గణతంత్ర స్ఫూర్తి గురించి పలువురు ప్రముఖులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ 'ఎట్ హోమ్' కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

# ఎర్రకోటపై మువ్వన్నెల రెపరెపలు

ఢిల్లీ : గణతంత్ర వేడుకలు దేశరాజధాని ఢిల్లీలో అంగరంగ వైభవంగా సాగాయి. రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము.. ముఖ్య అతిథులతో కలిసి సంప్రదాయ 'రాష్ట్రపతి బగ్గీ'లో కర్తవ్య పథ్కు చేరుకున్నారు.జాతీయ జెండాను ఆవిష్కరిం చిన అనంతరం, 21 గన్ సెల్యూట్తో గౌరవ వందనం స్వీకరించారు. ఈ ఏడాది యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజర య్యారు. కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షించిం ది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పా ల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్డెర్ లేయెన్ భారతీయత ఉట్టిపడేలా డ్రెస్ ధరించారు. ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఉదా. ఆకుపచ్చ రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో నేసిన బంగారు రంగు మోటిఫ్లతో అది ఆకర్ష ణీయంగా కనిపించింది. ఈ రాజస్థానీ సంప్ర దాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్ర తిబింబించింది. మరోవైపు ఉర్సులా.. మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రెస్ ధరించారు. ఈ వస్త్రధారణతో ఈ వేడుక కు తగ్గట్టుగా ! ఆమెలో భారతీయ సంప్రదాయం ఉట్టిపడింది. ఆమె సాధారణంగా ధరించే ప్యాంట్సూ టస్కు భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా సమాఖ్యకు ఉర్సులా తొలి మహిళా అధ్యక్షురాలు.

**ఆకట్టుకున్న సిందూర్**

'ఆపరేషన్ సిందూర్'లో వాడిన పలు స్వదేశీ ఆయుధ వ్యవస్థల ప్రదర్శన ఈ సారి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిసారి బ్యాటిల్ ఆరే ఫార్మాట్'లో మన సైన్యం ఈ కవాతు లో పాల్గొంది. అంటే యుద్ధ క్షేత్రంలో పాల్గొంటున్నట్లుగా మన ఆయుధాలు, నిఘా వ్యవస్థలు, బలగాలను ఈ పరేడ్లో ప్రదర్శించారు. 'ఆపరేషన్ సిందూర్' థీమ్తో రూపొందించిన భారత సైన్యం శకటం మరింత ఆకట్టుకుంది. త్రివిధ దళాల సమన్వయం ఎంత శక్తిమంతంగా ఉంటుందో చాటిచెప్పేలా దీన్ని రూపొందించారు. బ్రహ్మోస్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, 300 కి.మీ. దూరం వరకు లక్ష్యాలను ఛేదించగలిగే 'సూర్యాస్త్ర' రాకెట్ లాంచర్ వ్యవస్థ, యుద్ధట్యాంకు అర్జున్ వంటివి ఈ పరేడ్లో ప్రదర్శించారు. కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్, శక్తిబన్ రెజిమెంట్, రెండు మూపురాల ఒంటెలు, జన్స్కార్ గుర్రాలు వంటివి తొలిసారిగా కవాతులో పాల్గొన్నాయి.

# రిపబ్లిక్ డే పరేడ్ దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక: ప్రధాని మోదీ

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశరాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన అద్భుతమైన పరేడ్ ముగిసిన అనంతరం, ఈ వేడుకలు "దేశ ప్రతిష్ఠకు శక్తిమంతమైన ప్రతీక" అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ వేడుకల ద్వారా భారతదేశ ప్రజాస్వామ్య బలం, సాంస్కృతిక వారసత్వ సంపద, దేశాన్ని ఏకతాటిపై నిలిపే ఐక్యత ప్రదర్శితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో, గర్వంతో జరుపుకుందని ప్రధాని తెలిపారు. "గణతంత్ర దినోత్సవ పరేడ్, భారతదేశ అద్భుతమైన భద్రతా వ్యవస్థను ప్రదర్శించింది. ఇది మన దేశ సంసిద్ధత, సాంకేతిక సామర్థ్యం, పౌరులను రక్షించడంలో మనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని మోదీ మరో పోస్ట్‌లో వివరించారు. మన భద్రతా దళాలు నిజంగా దేశానికి గర్వకారణమని ఆయన కొనియాడారు.పరేడ్ ప్రారంభానికి ముందు, ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో గణతంత్ర వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పరేడ్‌లో భారత సైన్యం తొలిసారిగా 'బ్యాటిల్ అర్రే' ఫార్మాట్‌లో తమ యుద్ధ నైపుణ్యాలను ప్రదర్శించింది. స్వదేశీ ఆయుధాలు, క్షిపణి వ్యవస్థలతో పాటు, వివిధ రాష్ట్రాలు, మంత్రిత్వ శాఖలకు చెందిన శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కర్తవ్యపథ్‌లో కనువిందు చేశాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని మోదీ పరేడ్ ముగిశాక ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి కర్తవ్యపథ్‌లో నడిచారు. ఆయన చాలా దూరం నడుస్తూ, ఇరువైపులా ఉన్న ప్రేక్షకులకు అభివాదం చేశారు. ప్రధానిని చూసిన ప్రజలు 'భారత్ మాతా కీ జై', 'మోదీ-మోదీ' నినాదాలతో హోరెత్తించారు. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని, ఉత్సాహంగా ఆయనకు స్వాగతం పలికారు. చిన్నారులు కుర్చీలపైకి ఎక్కి మరీ ప్రధానిని చూసేందుకు ఆసక్తి చూపారు. కొంత దూరం నడిచిన తర్వాత, ప్రధాని తన వాహనంలోకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాజస్థానీ సంప్రదాయ తలపాగా, నెమలి ఈకల అలంకరణతో మోదీ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో మరోసారి ఆకట్టుకున్నారు.

# అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకలు అద్భుతం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు అద్భుతంగా జరిగాయని, ఈ కార్యక్రమం రాష్ట్ర భవిష్యత్ లక్ష్యాలకు అద్దం పట్టిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివర్ణించారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన సోమవారం తన స్పందనను తెలియజేశారు.నేలపాడులోని పరేడ్ మైదానంలో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చిందని పవన్ పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న 22 శకటాలు రాష్ట్ర ప్రగతిని చక్కగా ప్రతిబింబించాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి సకల సౌకర్యాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. ఈ వేడుకల వేదికపై నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిందని కొనియాడారు.

భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రాభివృద్ధిని ముందుకు తీసుకువెళతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమరావతిలో తొలిసారి గణతంత్ర దినోత్సవ వేడుకలు

- మొదటి పేజి తరువాయి

వేడుకల అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికతో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. సామాజిక పెన్షన్లకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చి 63 లక్షల మందికిపైగా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చుతున్నట్లు వెల్లడించారు. 'దీపం' పథకం ద్వారా పేద మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు.ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తున్నామని గవర్నర్ చెప్పారు. నీటి భద్రతను ప్రధాన విధానంగా తీసుకుని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం 'పొలం పిలుస్తోంది', 'రైతన్న మీ కోసం' వంటి కార్యక్రమాల ద్వారా నేరుగా మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు.రవాణా రంగంలో రోడ్డు, రైల్వే, జల రవాణాకు సమాన ప్రాధాన్యం ఇస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని పూడ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు విశాఖను ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీల అమలుతో వినియోగదారులపై భారం తగ్గించామని వివరించారు.

ఎంఎస్ఎంఈల ప్రోత్సాహం, ప్లగ్ అండ్ ప్లే విధానం, టూరిజం పాలసీ 202429 అమలు, స్వచ్ఛ ఆంధ్ర సేఫ్ ఆంధ్ర కార్యక్రమాలు, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, ఏఐ టెక్నాలజీపై దృష్టి వంటి అంశాలను గవర్నర్ ప్రస్తావించారు. 2047 'స్వర్ణ ఆంధ్ర' విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో రైల్ ప్రాజెక్టులపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు.మొత్తంగా అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్రానికి కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టుగా, అభివృద్ధి, సంక్షేమాలపై ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబించేలా నిలిచాయి.

# కలిసికట్టుగా పనిచేస్తే దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరి

ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు కరుణాలయం (లూథరన్ చర్చి) ప్రతిష్టా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి నూతన చర్చిని ప్రారంభించడంతో పాటు, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "దేవుడు మనకు పరీక్షలు పెడతాడు. కానీ, ఆ పరీక్షలను జయించే శక్తిని కూడా ఆయనే మనకు ప్రసాదిస్తాడు. ఎవరూ ఊహించని విధంగా ఈ మందిరాన్ని పునర్నిర్మించుకోవడం గొప్ప విషయం. కష్టాల్లో ఉన్న మన తోటివారిని ఆదుకోవడం, వారికి అండగా నిలవడం మనందరి బాధ్యత" అని ఉద్బోధించారు. ఏడాదిలోపే చర్చి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న సంకల్పం నెరవేరిందని, పట్టుదలతో పనిచేసిన పునర్నిర్మాణ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. చేయి చేయి కలిపితే ఏదైనా సాధించవచ్చనడానికి ఈ నిర్మాణమే ఒక ఉదాహరణ అని కొనియాడారు. ఈ మందిర నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం దేవుడు తనకు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

ఈ రోజుల్లో చిన్న చిన్న విషయాలకే యువత, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. "పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది చాలా బాధాకరం. దేవుడు పెట్టే పరీక్షలను సంకల్ప బలంతో జయించాలి" అని ఆయన హితవు పలికారు. తన రాజకీయ జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ, "2019లో మంగళగిరిలో పోటీ చేసి ఓటమి పాలయ్యాను. అయినా నేను భయపడలేదు. మరింత కసితో పనిచేసి ప్రజలకు దగ్గరయ్యాను. ఓటమిని ఒక పరీక్షగా స్వీకరించి ముందుకు సాగాను" అని గుర్తుచేశారు. కులాలు, మతాలు వేరైనా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతూ కష్టాలను ఎదుర్కొందామని, దేవుడి ఆశీస్సులతో మంగళగిరిని అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవి, ఏఈఎల్సీ అడ్మినిస్ట్రేటర్ పి.యస్ జోసఫ్, రైట్.రెవరెండ్ డాక్టర్ ఎస్.జే బాబూరావు, రెవరెండ్ డాక్టర్ కొడాలి విజయ్, రెవరెండ్ జే.ఏసురత్నం, సంఘ పెద్దలు, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి అందరితో కలిసి ఫోటోలు దిగారు.

# బీసీ కార్డు వాడినంత మాత్రాన అమాయకుడైపోతాడా?

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన కల్తీ మద్యం కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. తాజాగా ఆయనపై ప్రస్తుత మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత... తాను తప్పు చేయలేదని, ఏ ప్రమాణానికైనా సిద్ధమని జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలపై సుభాష్ స్పందిస్తూ... "కేసులో అడ్డంగా దొరికిపోయి... దొంగ ప్రమాణాలు చేస్తే ఎలా?" అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జోగి రమేశ్ మంత్రిగా ఉండి, వీధి రౌడీలా వ్యవహరించారని మండిపడ్డారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత ఏ ప్రమాణానికైనా సిద్ధమని చెప్పడంపై వాసంశెట్టి సుభాష్ ఫైర్ అయ్యారు. "కల్తీ మద్యంతో పాటు అగ్రిగోల్డ్ కేసులో కూడా సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. బీసీ కార్డు వాడినంత మాత్రాన జోగి రమేశ్ అమాయకుడైపోతాడా అని నిలదీశారు. వైసీపీ చేసిన పాపాలకు దేవుడు వారిని 11 సీట్లకే పరిమితం చేశాడని సుభాష్ విమర్శించారు. జోగి రమేశ్ 83 రోజుల పాటు జైలులో ఉన్నారని, 8+3=11 అవుతుందని ఎద్దేవా చేశారు.

## చిన్నారి ప్రాణాలు తీసిన చైనా మాంజా

చైనా మాంజా కారణంగా మరో విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో ఐదేళ్ల బాలిక మాంజా కారణంగా ప్రాణాలు కోల్పోయింది. మేడ్చల్ జిల్లా ఖాజీపల్లి నుంచి తండ్రితో పాటు ఇద్దరు కుమార్తెలు ద్విచక్ర వాహనంపై కూకట్‌పల్లికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. వివేకానందనగర్ హైవే వద్ద చైనా మాంజా బాలిక నిష్విక మెడకు చుట్టుకుంది. దాంతో ఆమె కిందపడిపోయింది. తీవ్ర గాయం కావడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.చైనా మాంజా సాధారణ నూలు దారం కాదు. ఇది నైలాన్ లేదా సింథటిక్ పదార్థంతో తయారవుతుంది. దానిపై గాజు ముక్కల పొడిని పూస్తారు. ఈ దారం పక్షుల రెక్కలను, మనుషుల నరాలను కోసేంత ప్రమాదకరంగా ఉంటుంది. ఇది తెగిపోయి ఎక్కడైనా చిక్కుకుంటే ప్రాణాంతకంగా మారుతుంది. తెలంగాణ ప్రభుత్వం చైనా మాంజా అమ్మకాలపై నిషేధం విధించినప్పటికీ, కొందరు రహస్యంగా విక్రయిస్తున్నారు.

## భారత్‌తో మాది చారిత్రక బంధం

భారత్ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రభుత్వానికి, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా అమెరికా, భారత్‌ల మధ్య చారిత్రాత్మక బంధం ఉందని ఆయన కొనియాడారు. సోమవారం ట్రంప్ సందేశాన్ని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో పంచుకుంది. "మీ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమెరికా ప్రజల తరఫున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు" అని ట్రంప్ తన సందేశంలో పేర్కొన్నారు.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఏడాదిలో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు. "రక్షణ, ఇంధనం, కీలక ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగాల్లో మన మధ్య బలమైన సహకారం ఉంది. క్వాడ్ వేదికగా బహుళస్థాయి భాగస్వామ్యంతో ఇరు దేశాలకు, ఇండో-పసిఫిక్ ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతోంది" అని రూబియో తన ప్రకటనలో వివరించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి, దేశం సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను చాటుతూ దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ పరేడ్, దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తారు.

## భారత్, ఈయూ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం..తగ్గనున్న కార్ల ధరలు!

విజయవంతమైన భారత్... ప్రపంచాన్ని మరింత స్థిరంగా, సుసంపన్నంగా, సురక్షితంగా మారుస్తుందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ అన్నారు. భారత్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, భారత్‌తో చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం ఖరారు కానున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన ఆమె, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.రేపు ప్రధాని మోదీతో జరగనున్న శిఖరాగ్ర సమావేశంలో భారత్, 27 దేశాల యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై చర్చలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ ఒప్పందాన్ని "అన్ని ఒప్పందాలకూ తల్లిలాంటిది" (ఎశోష్ఠవతీ శీట ఖశ్రీశ్రీ నముఖశ్రీం) అని, "చరిత్రాత్మక ఒప్పందం" అని ఉర్సులా గతంలో అభివర్ణించారు. ఈ ఒప్పందం ద్వారా దాదాపు 200 కోట్ల జనాభాతో కూడిన అతిపెద్ద మార్కెట్ ఏర్పడుతుందని, ఇది ప్రపంచ జీడీపీలో దాదాపు నాలుగో వంతు అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్... భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇరుపక్షాల మధ్య వస్తు వాణిజ్యం 135 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ వాణిజ్య ఒప్పందం కోసం 2007లో చర్చలు ప్రారంభమైనా, 2013లో నిలిచిపోయాయి. 2022లో ఈ చర్చలను తిరిగి ప్రారంభించారు.

ఈ ఒప్పందంలో భాగంగా యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను భారీగా తగ్గించడానికి భారత్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 110శాతం వరకు ఉన్న పన్నును తొలుత 40 శాతానికి, ఆ తర్వాత దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నట్లు సమాచారం. ఇది వోక్స్‌వ్యాగన్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్ల కంపెనీలకు భారత మార్కెట్‌లో ప్రవేశాన్ని మరింత సులభతరం చేస్తుంది. దీంతో భవిష్యత్తులో యూరప్ కార్ల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

# గిద్దలూరులో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

గిద్దలూరు మండల తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి .తహశీల్దార్ ఆంజనేయరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోకరెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. ఎందరో వీరుల పోరాట ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారు అందచేసిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. భారతదేశం నేడు ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ అన్నీ రంగాల్లో ముందంజలో నిలుస్తోందని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన దేశం సాధిస్తున్న పురోగతి అమోఘమని కొనియాడారు. అదే విధంగా యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "మనం ఏ స్థాయిలో ఉన్నా సరే, మాతృభూమి పట్ల గౌరవాన్ని, బాధ్యతను మరువకూడదు. భారతదేశాన్ని మరింత ఉన్నత స్థానంలో నిలబెట్టడమే మనం ఆ మహనీయులకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, పార్లమెంట్ నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య మరియు పట్టణ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాకానికి ఘోర అవమానం

## పుల్లల చెరువు మండల కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది

**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 26**



పుల్లల చెరువు మండల కేంద్రంలోని అగ్రికల్చర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేయకుండా అధికారులు ఘోర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన ఘటన తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. గణతంత్ర దినోత్సవం పండుగ రోజున ప్రభుత్వ కార్యాలయంలో త్రివర్ణ పతాకం ఎగురవేయకపోవడం ద్వారా దేశభక్తి, జాతీయ గౌరవం పట్ల అధికారుల వైఖరి ఏ స్థాయిలో ఉందో ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోంది.ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ, రైతులకు సేవలందించాల్సిన అగ్రికల్చర్ శాఖ కార్యాలయంలోనే ఈ విధమైన అవమానం చోటుచేసుకోవడం ప్రజలను విస్మయానికి గురి చేసింది.ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, ఇది జాతీయ బాధ్యతను తృణప్రాయంగా భావించిన దారుణ ఉదాహరణ అని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు.జాతీయ పతాకాన్ని గౌరవించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి యొక్క ప్రాథమిక కర్తవ్యమని రాజ్యాంగమే చెబుతున్నా, అగ్రికల్చర్ కార్యాలయ అధికారులు మాత్రం ఆ కర్తవ్యాన్ని కాలరాశారని విమర్శలు వినిపిస్తున్నాయి.రైతుల సమస్యల పరిష్కారంలో ముందుండాల్సిన అధికారులు, కనీసంగా జెండా ఎగురవేయడం వంటి బాధ్యతను కూడా నిర్వర్తించకపోవడం పరమ దురదృష్టకరమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి నిర్లక్ష్యంపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.జాతీయ పతాకాన్ని అవమానించే ఇలాంటి ఘటనలు కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం సడలిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు కళ్లు తెరిచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# కనిగిరికి రైలు రాకకు లైన్ క్లియర్

## - తుదిదశలో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్ట్ - కనిగిరికి 30న ట్రయల్ రైలు రాక

## - రిపబ్లిక్ డే సందర్భంగా రైల్వే డిప్యూటీ సీఈ బద్దియ్య



**కనిగిరి ఆర్సీ ఇంచార్జి, పెన్ పవర్, జనవరి 26**

నడికుడి - శ్రీకాళహస్తి కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్లో భాగంగా కనిగిరి - - శ్రీకాళహస్తి ప్రతిష్టాత్మక రైల్వే ప్రాజెక్ట్ వేగంగా ముందుకు సాగుతూ, అన్ని ఆధునిక సౌకర్యాలతో దాదాపు పూర్తి స్థాయిలో సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కనిగిరి ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది. కనిగిరి రైల్వే స్టేషన్ను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తూ, ప్రయాణికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. స్టేషన్కు చేరుకునేందుకు అప్రోచ్ సిమెంట్ కాంక్రీట్ రోడ్డు, విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియా నిర్మించి, ప్రయాణికుల రాకపోకలు సులభంగా జరిగేలా రూపకల్పన చేశారు. అదేవిధంగా హై లెవల్ ప్లాట్ఫామ్( పిఎఫ్ ) నిర్మాణం పూర్తికాగా, ప్రయాణికుల రక్షణ కోసం కాప్ బస్ టైప్ షెల్టర్లు, అవసరమైన చోట్ల నీటి కుళాయిలు, ప్లాట్ఫామ్పై ఆకర్షణీయంగా రూపొందించిన షెడ్లు, ప్రయాణికుల సౌకర్యార్థం జనరల్ వెయిటింగ్ హాల్, బుకింగ్ కౌంటర్, స్టేషన్ ముందు భాగంలో పోర్టికో ఏర్పాటు చేశారు. అదనంగా, సర్క్యులేటింగ్ ఏరియాలో అందమైన ల్యాండ్ స్కేపింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. ఈసందర్భంగా డిప్యూటీ సీఈ (రైల్వే) బద్దియ్య మాట్లాడుతూ ఈనెల 30 నాటికి కనిగిరి వరకు ట్రాక్ రైలు (ట్రయల్ ట్రైన్) రానున్నట్లు తెలిపారు. ఆ ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయిన వెంటనే, అతి త్వరలోనే కనిగిరి వరకు సాధారణ రైళ్ల రాక ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కనిగిరి ప్రాంతంలో రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేసిన రెవిన్యూ అధికారులకు, సహకరించిన రైతులకు అన్ని విధాలా తోడ్పాటు అందించిన కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రిపబ్లిక్ డే సందర్భంగా కనిగిరి రైల్వే స్టేషన్లో జాతీయ జెండా ఆవిష్కరణ చేసి, రైల్వే అధికారులు, సిబ్బందితో కలిసి వేడుకలను నిర్వహించారు. ఈ రైల్వే ప్రాజెక్ట్ ద్వారా కనిగిరి ప్రాంతానికి రవాణా, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని, అలాగే విద్య, వైద్య అవసరాల కోసం ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి రానుందని ఆయన పేర్కొన్నారు.

# జిల్లా సర్వతోముఖాభివృద్ధి ప్రభుత్వం లక్ష్యం

## - పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు జిల్లా కలెక్టర్ జాతీయ పతాకావిష్కరణ

## - ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు











**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 26**

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దిగ్విజయంగా అమలు జరుగుచున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజబాబు పేర్కొన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు కలెక్టర్ పి. రాజాబాబు, జాతీయ పతాకావిష్కరణ గావించి, పోలీసు, ఎన్.సి.సి. దళాలచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తూ, పారదర్శకతతో కూడిన సుపరిపాలన అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ఆర్హులందరికి అందించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమర యోధులకు, భారత రాజ్యాంగం రూపొందించిన రాజ్యాంగ నిర్మాతలకు ఈ సందర్భంగా నా నమస్కారాలని తెలిపారు. 1947 ఆగస్టు 15 వ తేదీ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, యెందరో మహనీయులు, మేధావుల కృషి వల్ల భారత రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. 1950 జనవరి 26 వ తేదీ నుండి రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత భారతదేశం సర్వ సత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం గా అవతరించిందని, వికసిత్ భారత్ 2047 లో భాగంగా స్వర్ణాంధ్ర ఏ 2047 ను మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి వ్యవసాయ, పరిశ్రమలు, సర్వీసు రంగాలు వాటి అనుబంధ రంగాలలో 15 శాతము వృద్ధి రేటు సాధించాలనే దృఢ సంకల్పంతో మన రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. జిల్లా తలసరి అంచనా ఆదాయం 2,15,240 రూపాయలు ఉండగా 15 శాతము వృద్ధి రేటుతో 2028-29 కు 4,27,409 రూపాయలకు పెంపొందించేందుకు తగు ప్రణాళికలు తయారు చేయటమైనదని వివరించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకొని రాబోయే 5 సంవత్సరాలలో 15% వృద్ధి రేటు సాధించడానికి తయారుచేసిన "డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్" రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం పొందినదని, అదేవిధముగా జిల్లాలోని 6 నియోజకవర్గాలకు "విజన్ యాక్షన్ ప్లాన్" అమలుకొరకు శాసన సభ్యుల వారి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడమైనదని, అదేవిదముగా మండల స్థాయిలో కూడా మండల విజన్ యాక్షన్ ప్లాన్ ను తయారుచేసి ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర సాధనకై ప్రవేశపెట్టిన 10 సూత్రాలు అమలు చేయుట ద్వారా వృద్ధిరేటు సాధించటానికి కృషిచేయటం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేకమైన విధానాన్ని రూపొందించటం ద్వారా మన ప్రజలను విలువైన ఆస్తులుగా గుర్తిస్తూ, మెరుగైన జీవన ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి చే రూపొందించబడిన ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యం (పి4) అనే ఒక వినూత్న విధానాన్ని అమలుపరుస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా మన జిల్లాలో పేదరికంలో అట్టడుగున ఉన్న 79,099 బంగారు కుటుంబాలను గుర్తించి ఇప్పటివరకు 3,753 మంది మార్గదర్శులు, 26,275 బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనియున్నామన్నారు. సదరు బంగారు కుటుంబాలకు అవసరమైన ఆర్థిక, ఆర్థికేతర అవసరాలను సర్వే ద్వారా గుర్తించబడినవి. త్వరలోనే మిగిలిన బంగారు కుటుంబాలను మార్గదర్శులను గుర్తించి 2029 సంవత్సరము నాటికి ఆంధ్రప్రదేశ్ ను పేదరికం లేని స్వర్ణాంధ్రప్రదేశ్ గా రూపు దిద్దుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయడమైనదన్నారు. ఇటీవల కాలంలో జిల్లా యంత్రాంగం వసతి గృహాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, నిర్వహణ లోపాలను తెలుసుకొనుట జరిగినది. వాటిని పరిష్కరించుటకై ఒక అధికారికి ఒక వసతి గృహమును కేటాయించి జిల్లా అధికారుల ప్రత్యక్ష భాగస్వామ్యంతో, పర్యవేక్షణ ద్వారా సామాజిక సంక్షేమ హాస్టళ్ల పనితీరును బలోపేతం చేయడం జరిగిందని వివరించారు. జిల్లాలోని ప్రజలకు సురక్షితమైన త్రాగునీటిని అందించుటకు గాను జల సురక్ష మాసంలో భాగంగా జిల్లాలో గల మొత్తం 1002 నీటి ట్యాంక్ లను శుభ్రపరిచటం జరిగినది, అలాగే జిల్లాలో 195 పైపులైన్లు లీకేజీలు కనుగొని వాటి మొత్తం లీకేజీలను మరమ్మత్తులు చేసి, నిలిచిపోయిన నీటిని సక్రమంగా సరఫరా అయేలా చేసి నీటి కాలుష్యంను అరికట్టడం జరిగింది. పేలవమైన పరిస్థితులలో ఉన్నటువంటి 17 నీటి ట్యాంక్ లకు పాత పొరలను పూర్తిగా స్క్రాప్ చేసి, ఎమల్షన్ పెయింట్లతో చక్కగా పెయింట్ చేసి, 101 చోట్ల నీటి వనరుల పరిసరాలు పరిశుభ్రం చేసి, పరిశుభ్రత పరిస్థితులు మెరుగు చేయటం జరిగింది. నిరంతర నీటి సరఫరా కోసం 14 మోటార్లకు మరమ్మతులు చేసి, వాడుకోలేని, పాడు అయినటువంటి 55 కుళాయిలను కొత్త కుళాయిలతో భర్తీ చేయటం జరిగిందని తెలిపారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దిగ్విజయంగా అమలు జరుగుచున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు :**

ఒంగోలు లోని డ్రీమ్స్ హై స్కూల్ విద్యార్థులు, అపెక్స్ హై స్కూల్ విద్యార్థులు, ఒంగోలు అన్నవరపాడు లోని సూర్య హై స్కూల్ విద్యార్థులు, కొత్తపట్నం, తాళ్ళూరు, ముండ్లమూరు, పొన్నలూరు, కే బిట్రగుంట కెజిబివి విద్యార్థులు, టంగుటూరు మండలంలోని ఆలకూరపాడు జడ్పి ఉన్నత పాటశాల విద్యార్థులు, క్విస్ మరియు పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కొత్తపట్నం, తాళ్ళూరు, ముండ్లమూరు, పొన్నలూరు కే బిట్రగుంట కెజిబివి విద్యార్థులు ప్రదర్శించిన రెపరెపలాడే జెండా ప్రదర్శనకు మొదటి బహుమతి లభించగా, డ్రీమ్స్ హై స్కూల్, టంగుటూరు మండలం లోని ఆలకూరపాడు జడ్పి ఉన్నత పాటశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలకు సంయుక్తంగా ద్వితీయ బహుమతి, ఒంగోలు అన్నవరప్పాడు లోని సూర్య హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనకు తృతీయ బహుమతి లభించగా, అపెక్స్ హై స్కూల్ విద్యార్థులు, క్విస్, పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులచే ప్రదర్శించిన ప్రదర్శనలకు ప్రోత్సాహక బహుమతులు లభించగా, సంబంధిత విద్యార్థులకు, స్కూల్ యాజమాన్య ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ రాజాబాబు మెమోంటోలను అందచేశారు. ఈ సందర్భంగా పోలీస్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రదర్శించిన కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు**

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశు సంవర్ధక, సాంఘిక సంక్షేమ, బిసి వెల్ఫేర్, ఐటిడిఎ, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, డ్వామా, పంచాయితీ రాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా ప్రజా రవాణా శాఖలు ఆయా శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన శకటాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేడుకలకు విచ్చేసిన ప్రజలు , ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్డులు ప్రభుత్వ శకటాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ శకటాల ప్రదర్శనకు గాను పంచాయతీ రాజ్ శాఖ శకటానికి మొదటి బహుమతి, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ శకటాలకు సంయుక్తంగా రెండవ బహుమతి, సాంఘిక సంక్షేమ, బిసి వెల్ఫేర్, ఐటిడిఎ సంక్షేమ శాఖల శకటానికి తృతీయ బహుమతి, జిల్లా ప్రజా రవాణా, విద్య, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖల శకటాలకు ప్రోత్సాహక బహుమతి లభించగా, సంబందిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ రాజాబాబు మెమోంటోలను అందచేశారు.

**ఆకట్టుకున్న స్టాల్స్**

గణతంత్ర దినోత్సవ వేడుకలను సంధర్భంగా, మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ, మెప్మా, జిల్లా గ్రామీణాబివృద్ధి సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జల వనరులు, అటవీ శాఖ, జిల్లా నీటి యాజ్యమాన్య సంస్థ, విద్యా శాఖ, ఆర్.డబ్ల్యూ.ఎస్., ప్రణాళిక శాఖ, పరిశ్రమలు, మత్స్య శాఖ, రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ, పౌర సరఫరాల శాఖ, స్టెప్, పశు సంవర్ధక శాఖ, తదితర శాఖలు ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల పై ఏర్పాటుచేసిన స్టాల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలకు విచ్చేసిన ప్రజలు, విద్యార్థులు స్టాల్స్ ను ఆసక్తిగా తిలకించడం జరిగింది. భూగర్భ గనుల శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్ కు సంయుక్తంగా మొదటి బహుమతి లభించగా, రెవెన్యూ, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్ కు సంయుక్తంగా రెండవ బహుమతి, పశు సంవర్ధక శాఖ, స్టెప్ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్ కు సంయుక్తంగా తృతీయ బహుమతి లభించగా, సంబందిత అధికారులకు జిల్లా కలెక్టర్ రాజాబాబు మెమోంటోలను అందచేశారు.

**ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు**

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసి తమ విధుల పట్ల ఉత్తమ సేవలందించిన 549 మంది ఉద్యోగస్తులకు జిల్లా కలెక్టర్ రాజాబాబు, ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు ప్రకాశం పంతులు మునిమనవడు సంతోష్ కుమార్, గన్నవరపు వందనం కుమారుడు భాస్కర్ రావు, కరవాది వెంకటేశ్వర్లు కుమార్తె సుబ్బలక్ష్మి, అల్లుడు శేషగిరి రావు, పర్వతం వెంకటేశ్వర రావు కుమారులు శ్రీరామ్ ప్రసాద్ లను జిల్లా కలెక్టర్ రాజాబాబు సన్మానించడం జరిగింది. ఈ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఎస్పి వి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశి, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్, ఏపి టూరిజం డెవెలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ డా. నూకసాని బాలాజీ, ఏపి మాల వెల్ఫేర్ కార్పోరేషన్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ డా. పెదపూడి విజయకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు వైకాపా సంస్థాగత కమిటీల నిర్మాణ కార్యక్రమం

**–బుర్రా మధుసూదన్ యాదవ్**

**కందుకూరు పెన్ పవర్, జనవరి 25**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం 03.00 గంటలకు కందుకూరు పట్టణం లోని వెంగమాంబ కళ్యాణమండపం నందు వైకాపా సంస్థాగత నిర్మాణం కార్యక్రమ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు సభ్యులుమద్దెల గురుమూర్తి గారు, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వస్తున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి కందుకూరు మండల మున్సిపాలిటీ, ఉలవపాడు మండలం,గుడ్లూరు మండలం, వలేటివారిపాలెం మండలం,లింగసముద్రం మండలాల రాష్ట్రస్థాయిలో ఉన్నటువంటి వివిధ విభాగాల నాయకులు,జిల్లా వివిధ విభాగాల నాయకులు, నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు పార్టీ నాయకులు,గ్రామ క్లస్టర్ పరిశీలకులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయవలసిందిగా కోరారు.

# ఉత్తమ అధికారిగా రాళ్లపాడు డిఇ



**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

ఒంగోలులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం ఉత్తమ డి.ఈగా రాళ్లపాడు ప్రాజెక్టు డి.ఈ ఎం. వెంకటేశ్వర్లను అధికారులు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజబాబు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు డీఈ గా విధుల్లో చేరినప్పటి నుండి నిరంతరం ప్రాజెక్టు అభివృద్ధి కొరకు, ఆయకట్టు రైతులు కొరకు నిరంతరం పనిచేసేవారు. వర్షాకాలంలో ప్రాజెక్టు వద్దనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేస్తూ వారి సలహాలు సూచనలు తీసుకునేవారు. ఈ సందర్భంగా పలువురు డి.ఈకి అభినందనలు తెలియజేశారు.

**ఉత్తమ అటెండర్ గా ఏడుకొండలు**

ఒంగోలులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం ఉత్తమ అటెండర్ గా తోట ఏడుకొండలను అధికారులు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజబాబు చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.రాళ్లపాడు ప్రాజెక్టు అటెండర్ గా విధుల్లో చేరినప్పటి నుండి ప్రాజెక్టు వద్దనే ఉంటూ నిరంతరం పనిచేసేవారు.అధికారులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ విధులు పట్ల బాధ్యతగా ఉండేవారు దీంతో ఆయన ను ఉత్తమ అటెండర్ గా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారులు,సిబ్బంది, రైతులు ఏడుకొండలను అభినందనలు తెలిపారు.

# టిడిపి కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**కందుకూరు పెన్ పవర్ జనవరి 26:**

కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు జాతీయపతాకాన్ని ఆవిష్కరించగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్రం లభించిందని, వారి త్యాగాలను అందరం గుర్తుంచుకోవాలని అన్నారు. దేశాన్ని ప్రగతివైపు నడిపించేలా నేటి యువత దేశభక్తిని పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ మాట్లాడుతూ నియోజవర్గ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, కూనం నరేంద్ర, చుండూరి శ్రీనివాసులు, కల్లూరి శైలజ, ముచ్చు లక్ష్మీరాజ్యం, కంసాని మయూరి, ముచ్చు వేణు, సవిడిబోయిన వెంకటకృష్ణ, ముప్పరపు వేణు, కొత్తూరు వెంకట సుధాకర్, పీలా శ్రీనివాసరావు, పొన్నగంటి వెంకటరావు, సయ్యద్ అహ్మద్ భాష, షేక్ మూస, అత్తంటి శ్రీహరి నాయుడు, ఘట్టమనేని సుబ్బారావు, దామా రాంబాబు, భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, మచ్చ మనోహర్, నల్లూరి సూర్యనారాయణ, మరియు వార్డు అధ్యక్షులు అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రకాశం కళాశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), కందుకూరులో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశభక్తి ఉత్సాహంతో కళాశాల ప్రాంగణం సర్వాంగ సుందరంగా అలంకరించబడగా, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్సీసీ విద్యార్థులు క్రమశిక్షణతో అద్భుత పరేడ్ నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డా. విజయ్ శ్రీనివాస్ గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు, విధులు గురించి విద్యార్థులకు తెలియజేస్తూ, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు సామాజిక బాధ్యత, నైతిక విలువలు కలిగిన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి. హరి బాబు మాట్లాడుతూ భారతదేశం సాధించిన అభివృద్ధి పథాన్ని వివరించి, యువతే దేశ భవిష్యత్తని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ పండుగలు విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యత భావాలను పెంపొందిస్తాయని తెలిపారు. వేడుకల సందర్భంగా



కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అదేవిధంగా విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన "సంక్రాంతి రీల్స్ -- 2026" పోటీల ఫలితాలను కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. మొత్తం కార్యక్రమం దేశభక్తి ఉత్సాహం, క్రమశిక్షణ, సాంస్కృతిక విలువల సమ్మేళనంగా అద్భుతంగా సాగింది. విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందిస్తూ, బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలనే సంకల్పాన్ని ఈ వేడుకలు మరింత బలపరిచాయి. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైన అనుభూతిని అందించాయి.



# కొండికందుకూరులో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

కొండికందుకూరులో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మువన్నెల జెండా ఎగరవేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగశీ 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిందని అప్పట్నుండి గణతంత్ర దినోత్సవంగా భారతీయులు ఘనంగా జరుపుకుంటారని సర్పంచ్ అన్నారు. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలు పొందుపరచబడ్డాయని ఆయన అన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు



ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సంధ్భంగా గ్రామం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమం లో భాగంగా బ్లీచింగ్ చల్లించడం జరిగిందని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఘట్టమనేని రాంబాబు,ప్రధానోపాధ్యురాలు కట్టా సౌందర్య, సచివాలయం సిబ్బంది గల్లా రఘురామ్, కొంక శిరీష ముండ్లమూరి రేవతి, కమ్మ నాగలక్ష్మి గ్రామ నాయకులు ఈదర నరసయ్య,రెబ్బవరపు మాల్యాద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ సంస్కృతి స్కూల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

పట్టణంలోని గుర్రం వారి పాలెం లోని శ్రీ సంస్కృతి స్కూల్ లో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మెన్ ప్రిన్సిపాల్ అతిధులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సోషల్ టీచర్ నరసింహారావు భారత రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ సేవలను రాజ్యాంగ విలువలను విద్యార్థులకు వివరించారు. ఆ తరువాత విద్యార్థుల ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు భారత స్వాతంత్ర్య పోరాటం అనే నాటిక సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆ తరువాత విద్యార్థులందరూ దేశ సమగ్రతను కాపాడతామని, బాధ్యతాయుతమైన పౌరులుగా మెలుగుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ కొంకా చంద్రశేఖర్ మట్లాడుతూ ఆకాశంలో రెపరెప లాడుతున్న మన త్రివర్ణ పతాకం కేవలం ఒక వస్త్రం కాదు, అది 140 కోట్ల భారతీయుల ఆత్మగౌరవం. కాబట్టి మన రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ చెప్పినట్లు చదవండి, సమీకరించుకోండి, పోరాడండి.చివరిగా ఒకమాట... స్వాతంత్ర్య అంటే స్వేచ్ఛ కాదు, ఆ స్వేచ్ఛ ను గౌరవించే సంస్కారం మీ ప్రవర్తనతో మన సంస్కృతి స్కూల్ కీర్తని, తద్వారా మనదేశ




గౌరవాన్ని దశదిశలా చాటాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటూ విద్యార్థులకు తల్లిదండ్రులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరి, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి అకడమిక్ కో ఆరిధనేటర్ శకుంతల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు తల్లిదండ్రులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు.

# కొమరోలులో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండాలను ఎగురవేసి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించిన అధికారులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు.**



**కొమరోలు పెన్ పవర్ జనవరి 26**

భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం కొమరోలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తదితర ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు .కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా తాసిల్దార్ భాగ్యలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించగా, డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు .ఆ కార్యక్రమంలో మండల సర్వేయర్ జమాల్, జూనియర్ అసిస్టెంట్లు పెద్ద దేవనాయక్ ,రంగనాయకులు, శ్రీవిద్య, విఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నారావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి ఉపన్యసించారు. ఆ కార్యక్రమంలో మండల పరిషత్, జి ఆర్ జి కార్యాలయ సిబ్బంది, వెలుగు ఏపిఎం విద్యాసాగర్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏపిఎం విద్యాసాగర్ అధ్యక్షత వహించగా, ఎంపీడీవో చెన్నారావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు .ఆ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు వై. మోజెస్, జక్కుల స్వప్న, అకౌంటెంట్ సౌమ్య ,వివోఏలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి వైద్యాధికారి దేవరశెట్టి చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా, తాసిల్దార్ భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వైద్యాధికారి చంద్రశేఖర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో మరోవైద్యాధికారిని వి శాంతి, ఫార్మసిస్ట్ రమేష్ ,రేడియో గ్రాఫర్ నాగరాజు, హెచ్ ఈ ఓ లు ఆవులయ్య ,సౌజన్య ,స్టాఫ్ నర్సులు హసీనా ,సుకన్య, ప్రభావతి ,ఎఫ్ఎన్ఓ రాఘవి, పిహెచ్సి అసిస్టెంట్ ఇస్మాయిల్ ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. రాజుపాలెం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారిని మీర్జా హసీనారా జాతీయ జెండాను ఆవిష్కరించగా, మరో వైద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి ,ఫార్మసిస్ట్ బాల రంగయ్య తో పాటు స్టాఫ్ నర్సులు ,ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు. కొమరోలు పోలీస్ స్టేషన్లో ఎస్సై నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించగా ,ఆ కార్యక్రమంలో ఏఎస్ఐ మునాఫ్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు , మహిళా కానిస్టేబుళ్లు హోంగార్డులు పాల్గొన్నారు. కొమరోలు లోని గ్రామ సచివాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి ఓ రంగ జనార్ధన్ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ,జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో మూడు గ్రామ సచివాలయాల సిబ్బంది పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు. కొమరోలు లోని బీసీ బాలుర హాస్టల్ లో హెచ్ డబ్ల్యు ఓ కొండయ్య, బీసీ బాలికల హాస్టల్ లో హెచ్ డబ్ల్యు ఓ రోజా, ఎస్సీ బాలుర హాస్టల్లో హెచ్ డబ్ల్యు ఓ రామచంద్ర రెడ్డి, అల్లినగరంలోని బీసీ బాలుర హాస్టల్ లో హెచ్ డబ్ల్యు ఓ శ్రీనివాసులు జాతీయ జెండాలను ఎగురవేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కొమరోలు లోని సహకార బ్యాంకు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు .ఆ కార్యక్రమంలో సహకార బ్యాంకు సిబ్బంది ,మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు .కొమరోలు మండల విద్యాశాఖాధి కార్యాలయంలో ఎంఈఓ1 వెంకటేశ్వర్లు ,ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం జాతీయ జెండాను ఎగురవేశారు, ఆ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు డేటా ఆపరేటర్ రవీంద్రారెడ్డి, సి ఆర్ పి లు రామంజి, పుల్లయ్య ,ఆంజనేయులు, ఆదినారాయణ ,ఐ ఈ ఆర్టీలు శ్రీనివాసరెడ్డి ,సరస్వతి తదితరులు పాల్గొన్నారు. కొమరోలు లోని స్టేట్ బ్యాంక్ ఆవరణలో బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు ,యూనియన్ బ్యాంకు ఆవరణలో బ్యాంకు మేనేజర్ ఫరూక్, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆవరణలో మేనేజర్ అన్వేష్ కుమార్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కాగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో, విద్యాసంస్థలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# టీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ కు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు



**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కందుకూరు కు చెందిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్, కళాశాల అభివృద్ధికి, న్యాక్ ఏం గ్రేడ్ సాధించడానికి, కళాశాలలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు విద్యార్థుల యొక్క ఉన్నతికి చేసిన కృషికి గాను ప్రకాశం జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి 77 వ రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును స్వీకరించారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింతగా పెంచిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవికుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు డాక్టర్ ఎన్. తిరుపతి స్వామి, డాక్టర్ ఎన్వి. శ్రీహరి, బి. కమల బాబు, డాక్టర్ కేవీ. పద్మావతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రిన్సిపాల్ కి అభినందనలు తెలియజేశారు.

# వైకాపా కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

కందుకూరు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 77వ గణతంత్రదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి భారతదేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మారిన రోజును స్మరించుకుంటు ఇది దేశానికి పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి లభించిన రోజున దేశ ప్రజలందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను గుర్తుచేసుకుంటూ దేశ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోకల కొండయ్య, ఈదర రమేష్, గంగిరెడ్డి, చంద్రమౌళి, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఎంపీడీవోగా డాక్టర్ పి సుజాత

**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 26**

77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా ఒంగోలు గ్రౌండ్లో సోమవారం కలెక్టర్ పి రాజాబాబు చేతుల మీదగా ఉత్తమ సేవ ప్రశంసా పత్రమును ఎంపీడీవో డాక్టర్ పి సుజాతఅందుకున్నారు.గతంలో కొత్తపట్నం ఎంపీడీఓ గా పని చేయు సందర్భంలో 2019,2020 లో ఉత్తమ ఎంపీడీఓ గా రెండు పర్యాయాలు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం ను అందుకున్నారు.ఈ సందర్భంగా ఆమెకు ప్రజాప్రతినిధులు ఉద్యోగస్తులు అభినందనలు తెలిపారు.



# రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి కంచె

**గ్రామ బొడ్డు రాయిని సైతం వదలని ఆక్రమణదారుడు -అధికారులు పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తుల వినతి**


**ఆక్రమణదారుని పై కన్నెర్ర చేసిన మాజీ ప్రజా ప్రతినిధులు బైరెడ్డి, దారపనేని.**



ఆక్రమణకు గురైన రహదారి, బొడ్డు రాయిని గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తున్న బైరెడ్డి, దారపనేని.



ఆక్రమణకు గురైన గ్రామదేవత బొడ్డురాయి.



ప్రెస్ మీట్ లో ఆక్రమణ ల వివరాలు తెలుపుతున్న బైరెడ్డి, దారపనేని.

**పామూరు, పెన్ పవర్ జనవరి 26**

పామూరు మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలో గల పోతవరం గ్రామ రహదారిని వైసీపీకి చెందిన చెనికల మాల్యాద్రి గ్రామ రహదారిని, గ్రామ బొడ్డు రాయిని సైతం యదేచ్ఛగా ఆక్రమించి ఇనుప కంచె వేసి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేయడం పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ రహదారిని 2009-14వ సంవత్సరంలో అప్పటి, ప్రస్తుత శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, అప్పటి ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. 2014-19వ సంవత్సరంలో 2 కోట్ల రూపాయల నిధులతో అధికారుల పర్యవేక్షణలో 20 అడుగుల మేర రోడ్డును విస్తీర్ణం చేసి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. 2023లో గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు చెనికల మాల్యాద్రి గ్రామ రహదారిని, గ్రామ దేవత బొడ్డురాయిని 10 అడుగుల మేర ఆక్రమించి కంచె వేశారు. ఇదేమి విడ్డూరమని గ్రామస్తులు ప్రశ్నించగా మీ దిక్కున్న వారికి చెప్పుకోమని ఆక్రమణదారుడు సమాధానమిస్తున్నాడని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంపై ఫిబ్రవరి 2వ తేదీన కొత్తగా ఏర్పాటు అయిన మార్కాపురం జిల్లా కలెక్టర్ వారికి గ్రామస్తులతో కలిసి గ్రీవెన్స్ లో అర్జీ ఇవ్వటం జరుగుతుందని దారపనేని, బైరెడ్డి తెలిపారు. గ్రామానికి సంబంధించిన రైతు కూండ్ల వెంకటస్వామి మాట్లాడుతూ సర్వేనెంబర్ 86 లో తాను ఐదు ఎకరాల సెటిల్ మెంట్ భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నానని అయితే అసైన్మెంట్ ఆక్రమణదారుడు చెనికల మాల్యాద్రి పొలంలోకి వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బంది పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణలపై గతంలో పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టిన స్పందన లేదని ప్రస్తుత అధికారులు స్పందించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పాలన యంత్రాంగానికి అత్యున్నత చట్టం భారత రాజ్యాంగం

**వైస్సార్సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 26**

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అని,మానవ విలువలు, ప్రజాస్వామ్య విలువలుచాటి చెబుతుందని, పాల కులకు, పాలన యంత్రాంగనికి అత్యున్నత చట్టం భారత రాజ్యాంగమేనని రాష్ట్ర వైస్సార్సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం 77వ ఘనతంత్ర వేడుకలను పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేసి ఘణంగానిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ కమిటీ రచించిన రాజ్యాంగం మనందరికీ పవిత్ర గ్రంధం అని అన్నారు. రాజ్యాంగం మనకు అందించిన ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులను విలువైనవని,రాజ్యాంగంలోని ప్రతి అధికరణం మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా సహాయ కార్యదర్శి ఒంగోలు మూర్తిరెడ్డి,మండలపార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వానాద్,దోర్నాల, పుల్లలచెర్వు, పెద్దారవీడు, మండల పార్టీ అధ్యక్షులు గంట వెంకట రమణారెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, కృష్ణ రెడ్డి, పుల్లల చెరువు వైస్ యంపిపి లింగంగుంట్ల రాములు, దోర్నాల మైనారిటీ నాయకులు షేక్ షేక్ష వలి,తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో ముగ్గురికి ఉత్తమ సేవ అవార్డులు

**జూనియర్ అసిస్టెంట్ పెద్ద దేవనాయక్ ,అల్లినగరం వీఆర్వో పివి రమణ , రెడ్డి చర్ల వీఆర్ఏ భారతికి ఉత్తమ సేవ అవార్డులు**

**అవార్డు పొందిన ఉద్యోగులను అభినందించిన తాసిల్దార్ భాగ్యలక్ష్మి డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య తదితర సిబ్బంది.**



**కొమరోలు పెన్ పవర్ జనవరి 26**

కొమరోలు తాసిల్దార్ కార్యాలయానికి చెందిన ముగ్గురు ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉత్తమ సేవ అవార్డులు లభించాయి. భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను గుర్తించి వారికి ఉత్తమ సేవా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నది .అందులో భాగంగా కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న పెద్ద దేవ నాయక్, అల్లినగరం విఆర్ఓ గా పని చేస్తున్న పీవీ రమణ, రెడ్డి చర్ల వీఆర్ఏ గా పనిచేస్తున్న భారతి ఉత్తమ సేవా అవార్డులకు ఎంపికైనట్లుగా మార్కాపురం జిల్లా అధికారులు ప్రకటించి సమాచారం అందించారు .ఆ మేరకు సదురు ముగ్గురు ఉద్యోగులు అవార్డులు పొందేందుకు సోమవారం కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలను ముగించుకొని మార్కాపురం లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. తాసిల్దార్ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న వారిలో ఉత్తమ సేవా అవార్డులకు 6 మందిని ఎంపిక చేసి సిఫారసు చేశామని ,అయితే వారిలో ముగ్గురికి అవార్డులు లభించాయని అంటూ తాసిల్దార్ భాగ్యలక్ష్మి అవార్డులకు ఎంపికైన దేవా నాయక్, రమణ ,భారతీలను అభినందించారు. ఆమెతోపాటు డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, మండల సర్వే జమాల్, జూనియర్ అసిస్టెంట్లు రంగనాయకులు ,శ్రీవిద్య తదితర వీఆర్వోలు, వీఆర్ఏలు అవార్డు గ్రహీతలను అభినందించారు.

## ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**కొనకనమిట్ల పెన్ పవర్ జనవరి 26**

కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం హాజరైన వారికి స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యత,భారత రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుని బాధ్యత గురించి వివరించారు. దేశ స్వాతంత్ర్యం, సమానత్వం,వంటి అంశాలపై ప్రసంగాలు చేశారు. అదేవిధంగా మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో కూడా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి జాతీయతా భావాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మురళీ,ఎంపిడిఓ ఈశ్వరమ్మతో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



# సమాజమే దేవుని ప్రతిరూపం

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 26**



సమాజమేదేవాలయం ,ప్రజలే దేవుళ్ళు. ప్రకృతే దేవీ,దేవతల రూపం. మన చుట్టూ ఉన్న ప్రకృతిని, సృష్టిని గౌరవిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలని సనాతన ధర్మం వేల సంవత్సరాల క్రితమే పేర్కొన్నదని ప్రవాచకుడు నెమ్మాని సీతారామమూర్తి పేర్కొన్నారు. ఒంగోలులోని కేశవ స్వామి పేట లలితాశ్రమం 74 వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆయన సనాతన ధర్మం గురించి ప్రసంగించారు. వేదముల ద్వారా ధర్మ లక్ష్యాలను తెలిపారు. ఋగ్వేదము , యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము.. వాటిల్లో ఉన్న అంతరార్థాలను సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో ఉండేవారు.. ఆ కేవలం తత్వచింతనే కాక... ప్రజా ప్రయోజనాలను ఆకాంక్షించాలని వేదం ఏనాడో చెప్పిందని తెలిపారు. లౌకిక జీవనం (సెక్యులరిజం) అంటే మతరాహిత్యం కాదు. వ్యక్తి స్వాతంత్రం ధైర్యం సామర్థ్యం ఆత్మవిశ్వాసం మీద రూపొందే వ్యవస్థ అని అధర్వణ వేద సూక్తాలు చెప్తాయన్నారు. ప్రతి వారిలో మంచి భావనలు, తీయటి సంభాషణలు ఏర్పడాలి. అదే వేద లక్ష్యము అని చెప్పారు. వివిధ వేదాలలోని సూక్తాల ద్వారా వేలాది సంవత్సరాల కాలం నాడే భారతదేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడిందని తెలిపారు. అనేక ఉదాహరణలు పేర్కొన్నారు. యజ్ఞం జరిగిన తర్వాత.. యజ్ఞానికి ఆధ్వర్యం వహించిన రుత్వికులు, ప్రజా సమస్యలను సేకరించి, రాజ్య వ్యవస్థలకు నివేదించి పరిష్కారాలు చూపించడం ఆనాటి ప్రథమ ఆచారంగా పేర్కొన్నారు. సమాజానికి దూరంగా జరగడం, వైరాగ్య లక్షణాలు ఏర్పరచుకోవడం మొదలైనవి వేదకాలం తొలిదశలో లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన తరువాత సనాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సనాతన ధార్మిక సంఘం అధ్యక్షులు స్వయంపాకుల యలమందల కోటేశ్వర శర్మ జగమంతా రామమయం అనే అంశం మీద ప్రసంగించారు. చిన్నపిల్లలకు శ్రీరామరక్ష సర్వ జగద్రక్ష అంటూ... తల్లిదండ్రుల ఆశీర్వచనం అందించడం తోనే , రామ నామ స్మరణ ప్రారంభమవుతుందన్నారు. భార్యాభర్తల అనురాగాలు, సోదరుల అనుబంధం, పితృ వాక్య పరిపాలన, రాజ్య ధర్మ రక్షణ మొదలైన అనేక అంశాలతో రామతత్వం వృద్ధాప్యం దాకా మన వెన్నంటే నడుస్తున్నదిఅని పేర్కొన్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు మాతృశ్రీ విజ్ఞానానంద సరస్వతీ మాతాజీ వారిద్దరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి చింతలపూడి అప్పారావు, వివిధ ధార్మిక సాహిత్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, అగస్త్యరాజు వెంకట శివ సుబ్రహ్మణ్య శర్మ, ఎస్ .వి శివకుమారి, ఉప్పలపాటి వెంకటరత్నం, నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ, నిమ్మగడ్డ ప్రసాద శర్మ, జంధ్యం రాధా రమణ గుప్తా,నరసింహారావు, ఓరుగంటి ప్రసాదు, పర్వతం రాంప్రసాద్ పమిడిఘంతం శివరామకృష్ణ తదితరులు పాల్గొని ప్రవచనకర్తలను అభినందించారు.

# పాలూరులో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుక



**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

పాలూరు గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎస్.కె అబ్దుల్లా ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాకు తెలిసిన పాఠశాలల్లోకెల్లా ఈ యొక్క పాఠశాల అన్ని విధాలుగా మెరుగగా ఉందని విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం గురించి క్లుప్తంగా సున్నితంగా ఆయన తెలియజేశారు. తదుపరి పాలూరు గ్రామ పంచాయతీకి సంబంధించి జనసేన పార్టీ అధ్యక్షులు ఎద్దల మహేష్ బ్యాగు పలక బలపం పాఠశాలలో ఉన్నటువంటి విద్యార్థులకు అందరికీ కూడా పంపిణీ చేయడం చాలా సంతోషకరంగా ఉందని ఇలాంటి మంచి కార్యక్రమాలు ప్రతివారు గ్రామంలో అనుకుని పాఠశాలకు చేసి వారి అభ్యున్నతికి వారే తోడ్పడాలని ఆయన కోరారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమాని పాలూరు గ్రామ పంచాయతీ జనసేన అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ మా నాయకులు కూటమిలో భాగంగా ఉండటం మాకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆయన ఆశ సాధన కోసం మాకు ఉన్నతిలో ఎంతో కొంత మేము మంచి పనులు చేయాలని ఆయన కృషికి మేము భాగస్వాములం కావాలని ఇదే కాకుండా ప్రతి నెలకు సంబంధించి స్లిప్ టెస్ట్, యూనిట్ టెస్ట్ ప్రతి విద్యార్థికి ప్రతినెల ఫస్ట్ అండ్ సెకండ బహుమతులు అందజేస్తామని మా పాఠశాల అభివృద్ధి మాకు ముఖ్యమని మా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని మేము అనుసరిస్తున్నామని ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి 20 మంది విద్యార్థులకు బ్యాగులు పలకలు, బలపాలు ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. తర్వాతగా మిఠాయిలు పంచిపెట్టారు.

# రాజ్యాంగ ఫలాలు అందరికి అందేలా కూటమి ప్రభుత్వం కృషి

**టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు**

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 26**

దేశంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం రచించిన బాబా సాహెబ్ అంబేద్కర్ మనందరికీ మార్గదర్శకుడని, రాజ్యాంగం సూచించిన పరిపాలన మార్గంలోనే స్వేచ్ఛావాయువులు పిలుస్తున్నామని,రాజ్యాంగ ఫలాలు అందరికి అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. సోమవారం 77వ ఘనతంత్ర వేడుకలను పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మతానికి ఒక గ్రంథం ఉంటుందని, భారత దేశ ప్రజలందరికి మహా గ్రంథం భారత రాజ్యాంగం అని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం మనకు అందించిందని అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, విధులు మనహక్కులను తెలుపుతాయని అన్నారు. రాజ్యాంగం స్ఫూర్తితో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తున్నారని, రాజ్యాంగ ఫలాలు అందరికి అందేలా పాటు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, మండల పార్టీ




అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, నాయకులు చేకూరి సుబ్బారావు, వేగినాటి శ్రీనివాస్, తోట మహేష్ నాయుడు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, కందుల నారాయణ రెడ్డి, మైనారిటీ నాయకులు షేక్ మస్తాన్ వలి, షేక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ మార్క్స్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ సంబరాలు



**పామూరు, పెన్ పవర్ జనవరి 26**

77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తితో ఘనంగా జరిగాయి. సోమవారం సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రిన్సిపాల్ జయ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. జాతీయ గీతం ఆలపించారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్, దేశభక్తి నృత్యాలు, పరేడ్ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. విద్యార్థులు స్వాతంత్ర ఉద్యమ కారుల వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు దేశభక్తిని, జాతీయతను, క్రమశిక్షణను పెంపొందించడమే ఈ వేడుక ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ఐక్యతలో వైవిధ్యం చాటుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని వివరించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్రాముఖ్యత ప్రజాస్వామ్య విలువల గురించి విద్యార్థులకు ప్రసంగించారు. 1950 జనవరి 26 వ తేదీ నుండి మన సొంత రాజ్యాంగం ద్వారా పరిపాలన సాగిస్తున్నామని, రాజ్యాంగ రచన గావించిన రాజ్యాంగ రచన కమిటీ గురించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురించి వివరించారు. అలాంటి దేశ నాయకుల అడుగుజాడలలో విద్యార్థులు నడవాలని, ఉత్తమ పౌరులుగా ఉండాలని జయ కుమార్ కోరారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలి

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 26**

గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అన్ని విభాగాల కమిటీలను వెంటనే నియమించేందుకు కృషి చేయాలన్నారు. దీని కోసం పార్టీ కోసం నిరంతరం కష్టపడే వారిని గుర్తించి కమిటీల్లో స్థానం కల్పించాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందని చెప్పారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరిగే పరిస్థితి ఉండదని, కమిటీల్లో ఉత్సాహంగా పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. భవిష్యత్లో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. అలాగే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని, ఎప్పుడూ లేని విదంగా నాయకులు ఆవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, జెడ్ పీటీసీ చేదురి విజయభాస్కర్,గంట వెంకట రమణారెడ్డి,దోమకాల వెంకటేశ్వర్లు, కృష్ణ రెడ్డి,నియోజకవర్గ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ ఇంటిలిజెన్స్ అధికారిగా సయ్యద్ అమీర్



**పొదిలి, పెన్ పవర్, జనవరి 26**

ఉత్తమ ఇంటిలిజెన్స్ అధికారిగా సయ్యద్ అమీర్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం నాడు జిల్లా కేంద్రమైన మార్కాపురంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో ఇంటిలిజెన్స్ విభాగానికి ఉత్తమ సేవలు అందించినందుకుగాను అమీర్ కు అవార్డు దక్కింది. అవార్డు అందుకున్న అమీర్ ను పోలీస్ శాఖ తోపాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

# గిద్దలూరు పోలీస్ స్టేషన్లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

గిద్దలూరు పోలీస్ స్టేషన్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్బన్ సీఐ సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య ఆదేశాల మేరకు ఏఎస్ఐ జిలాని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని జాతీయ జెండా గౌరవ వందనం స్వీకరించారు . ఏఎస్ఐ జిలాని మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను గుర్తుచేస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# రాచర్ల స్పందన విద్యాసంస్థలలో అట్టహాసంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు





**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

రాచర్ల మండల కేంద్రంలోని స్పందన విద్యాసంస్థలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశభక్తి భావాన్ని చాటేలా 1050 మంది విద్యార్థులతో త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి నినాదాలతో పరిసరాలను మారుమ్రోగించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులచే దేశభక్తి నాటకాలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి సమాజం పట్ల గౌరవం, బాధ్యత అంకితభావంతో ఎదగాలని సూచించారు. "నేటి బాలలే రేపటి పౌరులు" అనే నినాదాన్ని విద్యార్థులకు గుర్తు చేశారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయిలు, సిబ్బంది , విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహణ

## పోటీలో 32 మంది మహిళలు –మొదటిస్థానం విజేత జొన్నలగడ్డ జ్యోతి

**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 26:**

రిపబ్లిక్ డే సందర్భంగా మండల కేంద్రమైన గుడ్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 32 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీలలో మొదటి స్థానంలో జొన్నలగడ్డ జ్యోతి విజేతగా నిలువుగా స్వర్గీయ చుండూరు మాలకొండయ్య (వార్డెన్)–అనసూయమ్మల జ్ఞాపకార్థం వారి అల్లుడు ఉన్నం వెంకటేశ్వర్లు మూడు వేల రూపాయలు నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానం సాధించిన ఎం.అనూష కు గుడ్లూరు సర్పంచ్ పాలకీర్తి శంకర్, బ్రహ్మయ్యలు రెండు వేల రూపాయల నగదు బహుమతి అందజేయగా, మూడవ స్థానం సాధించిన కె.అనూష కు మోచర్ల గ్రామానికి చెందిన సుదర్శి నాగేశ్వరరావు ఒక వెయ్యి రూపాయలు నగదు బహుమతి అందజేశారు. అంతేకాకుండా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మిగతా 29 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, ఎంపీటీసీ వరమ్మ, ఎంపీడీవో వై.వెంకటేశ్వరరావు, ఉన్నం వెంకటేశ్వర్లు, దామా




వెంకటేశ్వర్లు, రావూరి వేణు, మేకల మాల్యాద్రి, ఉమ్మనేని సుబ్బారావు, కారసాల బ్రహ్మనాయుడు, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవులు, జొన్నలగడ్డ రమణమ్మ, తల్లపనేని పార్వతి, ఇన్నమూరి సుధాకర్, అమరా మాల్యాద్రి, సన్నీ శెట్టి గిరిబాబు, చెన్నారెడ్డి మహేష్, మద్దిశెట్టి జాలయ్య,



గంగోలు మాల్యాద్రి, మండల స్థాయి అధికారులు ఎంఏఓ రవికుమార్, ఎంపీడీవో కార్యాలయం ఏవో కల్పన, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.

# అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్

## – పాల్గొన్న జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్













**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 26**

ప్రకాశం జిల్లాలో 2025 సంవత్సరంలో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి డీజీపీ కమెండేషన్ సిల్వర్ డిస్క్ (3), కాంస్య డిస్క్ (12)లతో పాటు ప్రశంసా పత్రాలను హాజరైన వారికి అందజేశారు. అలాగే జిల్లాలో పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

# కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఉన్నత పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**కొమరోలు పెన్ పవర్ జనవరి 26.**

భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కొమరోలు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు .ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించారు.ఆ కార్యక్రమంలో ఆ కళాశాల అధ్యాపకులు అల్లూరయ్య, రవి నాయక్, నారాయణ తో పాటు పలువురు అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది ,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వర అధ్యక్షత వహించగా ,కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ షేక్ సుభాని ముఖ్య అతిథులుగా పాల్గొని జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా సంజీవరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవ ఆవశ్యకతను ప్రధానోపాధ్యాయులు, శివనాగేశ్వరరావు, పలు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం ఆ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు సహకార సంఘం మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డి, కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని తోపాటు ,మల్లికార్జునరెడ్డి, కరీముల్లా ,ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు. కొమరోలు లోని ఎస్ బి ఎన్ ఆర్ ఎం పాఠశాలల్లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆ విద్యాసంస్థల కరస్పాండెంట్ బందుగుల నారాయణమ్మ, ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు .ఆ కార్యక్రమంలో పాఠశాల



ప్రధానోపాధ్యాయులు బందుగుల వెంకట సుబ్బారెడ్డి, ఎస్ ఎల్ వి ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ బందుగుల వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ రేవతి గణతంత్ర దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించి ,వివిధ రకాల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు .ఆ కార్యక్రమంలో ఆ పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు ,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. కొమరోలు లోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డైరెక్టర్ కె సందీప్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆ కార్యక్రమంలో ఆ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. నరేష్ రెడ్డి హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రామకృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు అందించారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కోరిశపాడులో ఘనంగా గణతంత్ర వేడుకలు అధికారులకు ప్రశంసాపత్రాలు



**అద్దంకి ఆర్సీ ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 26:**

కోరిశపాడు మండల పరిషత్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసన్న కుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.వి. సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, జడ్పీటీసీ వెంకటరమణ పాల్గొని రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించగా, విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. కాగా, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కోరిశపాడు తహసీల్దార్ జి.వి. సుబ్బారెడ్డి, మేదరమెట్ల ఎస్.ఐ మహమ్మద్ రఫీలు జిల్లా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసాపత్రాలను అందుకున్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా వీరిని ప్రత్యేకంగా అభినందించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పొదిలిలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, జనవరి 26**

పొదిలిలో సోమవారం నాడు గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల తహసిల్దార్ ఎంబి కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ షాజిదా, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాను ప్రధానోపాధ్యాయురాలు కరిమున్ బీబీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ వై వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎందరో మహనీయులు స్వాతంత్రం కోసం చేసిన పోరాటాలు, త్యాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి గారిని కలిసిన వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

రాచర్ల మండలంలోని చిన్నగాని పల్లె గ్రామస్తులు సోమవారం వైసిపి ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి ని గిద్దలూరు లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారితో ప్రవీణ్ కుమార్ రెడ్డి చర్చించారు. పార్టీని బలోపేతం చేస్తూ గతంలో జగనన్న ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో చోళ్ళవీడు ఎంపిటిసి సుబ్బారాయుడు, కృష్ణారెడ్డి, బిజ్జం వెంకటేశ్వర్ రెడ్డి,బాదుల్లా, మహేష్, మౌలాలి, ఖాజావలి, బొజ్జ వెంకటేశ్వర్లు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# మార్కాపురంలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుక

## ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు -అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

## ప్రభుత్వ పథకాలు తెలిపేలా స్టాల్స్ -స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సన్మానం

## అధికారుల సేవలకు ప్రశంసాపత్రాలు -వేడుకలో పాల్గొన్న ఎంపీ మాగుంట, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు,విద్యార్థులు











**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ జనవరి 26**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తూ అన్ని రంగాల్లోనూ జిల్లాను ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మార్కాపురంలోని ఎస్వికెపి కళాశాల మైదానంలో జరిగిన 77వ గణతంత్ర దిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాప్ వాహనంలో మార్కాపురం డి.ఎస్.పి. ఉప్పుటూరి నాగరాజుతో కలిసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజానీకాన్ని ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాలోని వనరులను సమర్థంగా వినియోగించి వచ్చే ఐదేళ్లలో 15% వృద్ధిరేటుతో జిల్లాను అభివృద్ధి పథంలో నడపడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. పేదరిక నిర్మూలన దిశగా, ప్రజలను విలువైన ఆస్తులుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ-4 పథకం ద్వారా మార్కాపురాన్ని పేదరికం లేని జిల్లాగా

తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ దిశగా మార్గ నిర్దేశం చేస్తున్న గౌరవ ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతూ, సహాయ సహకారాలు అందిస్తున్న అధికారులకు, స్వచ్ఛంద సంస్థలకు, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

**ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు**

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అందిస్తున్న పౌర సేవలను తెలియజేసేలా వ్యవసాయ, ఉద్యాన, విద్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ( వెలుగు ), వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ - గ్రామ / వార్డు సచివాలయాలు, పశు సంవర్ధక - మత్స్య శాఖ, డ్వామా, ఏపీఎస్ఆర్టీసీ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనకుగాను పంచాయతీ రాజ్ శాఖకు మొదటి బహుమతి, డ్వామా శాఖకు ద్వితీయ బహుమతి, వ్యవసాయ - ఉద్యానవన శాఖకు తృతీయ బహుమతి లభించాయి. ఏపీఎస్ ఆర్టీసీకి కన్సోలేషన్ బహుమతి వచ్చింది.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..:** ఈ వేడుకలలో 17 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ ప్రదర్శనలకుగాను అన్ని బృందాలకు జాయింట్ కలెక్టర్ బహుమతులు ఇచ్చారు.

**ప్రభుత్వ పథకాలు తెలిపేలా స్టాల్స్**

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించేలా వ్యవసాయ, జల వనరులు, గ్రామీణ నీటిపారుదల, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా ), గనులు - భూగర్భ శాఖ - జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ( వెలుగు ), మహిళాభివృద్ధి - శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ ( పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రెవెన్యూ క్లినిక్ ), ఉద్యాన శాఖ - మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ , పశుసంవర్ధక శాఖ, అటవీ శాఖ, విద్యాశాఖ ( పురాతన నాణెములు - పోస్టల్ స్టాంపులు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ )లు ఎగ్జిబిషన్ స్టాల్స్ ను ఏర్పాటు చేశాయి. జాయింట్ కలెక్టర్, డి.ఎస్.పి, డీఎఫ్ఓ అబ్దుల్ రవూఫ్ వీటిని సందర్శించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రజలు కూడా ఆసక్తిగా వీటిని తిలకించారు. ఈ స్టాల్స్ ఏర్పాటుకుగాను గ్రామీణ నీటిపారుదల శాఖకు ప్రథమ, అటవీశాఖకు ద్వితీయ, గనులు - భూగర్భ శాఖకు తృతీయ బహుమతులు వచ్చాయి. స్టాల్స్ ఏర్పాటుచేసిన ఇతర అన్ని శాఖలకు కూడా బహుమతులను ప్రధానం చేశారు.

**ఎస్.హెచ్.జి.లకు ఆర్థిక సహాయం..:** మెరుగైన జీవనోపాధి కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు కూడా సందర్శన సమయంలో బ్యాంకు రుణాల మంజూరు చెక్కులను జాయింట్ కలెక్టర్, డి.ఎస్.పి, డీఎఫ్ఓ పంపిణీ చేశారు. మెప్మాలో 45 సంఘాలకు రూ.20.07 కోట్లను ఇచ్చారు. డిఆర్డిఏలో 111 మంది సభ్యులకు ఉన్నతి పథకంలో రూ.69 లక్షలు, స్త్రీ నిధి సహకారంతో 491 గ్రూపులకు రూ.19,57,60,000, సామాజిక పెట్టుబడి నిధి ( సీ.ఐ.ఎఫ్. ) ద్వారా 462 గ్రూపులకు రూ.6.06 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు.

**సేవలకు ప్రశంసాపత్రాలు..:** తమ విధుల పట్ల ఉత్తమ సేవలందించిన అధికారులకు, ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు మొత్తం 255 మందికి ప్రశంసా పత్రాలను జాయింట్ కలెక్టర్ ప్రదానం చేశారు. పోలీస్ పరేడ్ నిర్వహించిన ఎన్.సీ.సీ. విద్యార్థులకు కూడా ప్రశంస పత్రాలను ఇచ్చారు.

**స్వాతంత్ర్య కుటుంబాలకు సన్మానం...:** కొనకనమిట్ల మండలం మునగపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కైపు వీరారెడ్డి కుటుంబ సభ్యులను, కంభం మండలం తురి మెళ్ళ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు బెల్లంకొండ వెంకట రంగయ్య కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్, డీఎస్పీ, డీఎఫ్ఓ , ప్రజా ప్రతినిధులు సత్కరించి గౌరవించారు. ఈ వేడుకల్లో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్బాబు,

మార్కాపురం ఇంచార్జ్ సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన గంగసాని



**పామూరు, పెన్ పవర్, జనవరి 26**

బుక్కాపురం గ్రామానికి చెందిన పందిటి దానమయ్య, శైలజ ల కుమారుడు సునీల్ బి అమృత ల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది సోమవారం ఈ వివాహ వేడుకలకు వైఎస్ఆర్సిపి మండలం అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, గట్ల విజయ భాస్కర్ రెడ్డి. ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు శ్రీరామ్ శ్రీనివాసులు, తుపాకుల ఆంజనేయులు రెడ్డి, సూరిపోవు మాల్యాద్రి, చింతం రాజేష్, చింతం మోహన్, నల్లిపోగో సునీల్ కుమార్, సంధ్య, కాకి ఇజ్రాయిల్, ఎస్తేరమ్మ, పందిటి పౌలు,పందిటి షద్రక్, కాకి జోష్, పందిటి సుబ్బయ్య, పందిటి వెంగయ్య, పందిటి ఎస్తేరమ్మ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

# ఉత్తమ డాక్టర్‌గా అవార్డు అందుకున్న ప్రీతం కృష్ణ



**పొదిలి, పెన్ పవర్, జనవరి 26**

ఉత్తమ డాక్టర్ గా స్వర్ణ ప్రీతం కృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. డాక్టర్ ప్రీతం కృష్ణ ఒంగోలు రిమ్స్ లో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు గాను అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న ప్రీతం కృష్ణ పొదిలిలో ప్రముఖ మహిళా డాక్టర్ స్వర్ణ గీత తనయుడు. అవార్డు అందుకున్న డాక్టర్ ప్రీతం కృష్ణ ను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

# అద్దంకి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మువ్వన్నెల రెపరెపలు

## జెండా ఆవిష్కరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతి కుమారి

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 26:**

అద్దంకి రెవెన్యూ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా, దేశభక్తి ప్రపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గుండ్లకమ్మ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతి కుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, త్రివర్ణ పతాకానికి వందనం సమర్పించారు. కార్యక్రమం ప్రారంభంలో ఆమె మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా ఆమె స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు అందించిన రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా రెవెన్యూ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని, దేశాభివృద్ధిలో యువత, విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా స్థానిక పాఠశాల విద్యార్థులు ఆలపించిన జాతీయ గీతం, దేశభక్తి గీతాలాపన సభికులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థుల నినాదాలతో కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో అద్దంకి ఇన్చార్జ ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, అద్దంకి తహసీల్దార్ శ్రీ చరణ్, డివిజన్ స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బెల్లంకొండ దంపతులకు ఉత్తమ పురస్కార అవార్డు




**పొదిలి, పెన్ పవర్, జనవరి 26**

బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులకు ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు వారు గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సామాజిక సేవలతో పాటు ఉత్తమ విద్యా సేవలు అందించినందుకు బెల్లంకొండ శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా వారు జిల్లా కేంద్రమైన మార్కాపురంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న బెల్లంకొండ దంపతులకు పలువురు తమ అభినందనలు తెలియజేశారు.

# ఉత్తమ వి.ఆర్ ఓ గా వై.పి. రంగయ్య

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం మార్కాపురం లోఉత్తమ వి ఆర్ ఓగా వై.పి. రంగయ్యను అధికారులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె గ్రామంలో విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకుగాను ఈ గుర్తింపు లభించింది. ఈ పురస్కారం ఆయన సేవలకు మరింత ప్రోత్సాహంగా నిలిచింధని ప్రజలు ప్రశంసించారు.



# సమరయోధుల త్యాగ ఫలితమే గణతంత్ర దినోత్సవం...

**పుల్లలచెరువు పెన్ పవర్ జనవరి 26**

భారత రాజ్యాంగ ఆవిర్భావాన్ని, ప్రజాస్వామ్య విలువలను చాటిచెప్పే 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు పుల్లలచెరువు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడ్డాయి.స్వాతంత్ర సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలు ఈ వేడుకలను ఒక పండుగలా జరుపుకున్నారు.ముటుకుల సిద్ధార్థ హైస్కూల్, పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం సహా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి కార్యాలయంలోనూ జాతీయ గీతాలాపనతో పాటు దేశభక్తి నినాదాలు మార్మోగడంతో పరిసర ప్రాంతాలు దేశభక్తితో నిండిపోయాయి.ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీవో మరియదాస్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం భారత ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసిన రోజని అన్నారు.ఎంతోమంది త్యాగమూర్తుల త్యాగాల ఫలితంగా భారతదేశానికి రాజ్యాంగం లభించిందని, ఆ రాజ్యాంగం దేశానికి దిశానిర్దేశం చేస్తూ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సోదరభావం వంటి విలువలను పరిరక్షిస్తోందని కొనియాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి రాజ్యాంగ ఆత్మను అర్థం చేసుకుని ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత కలిగి ఉన్నాడని వారు సూచించారు.సిద్ధార్థ హైస్కూల్ కరెస్పాండెంట్ మానుకొండ శ్రీనివాస్ రెడ్డి సిద్దార్థ హైస్కూల్ లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని అన్నారు.రాజ్యాంగ నిర్మాణంలో ఆయన చూపిన కృషి, సహనం, నిబద్ధత వల్లనే నేడు భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్సింగ్ వంటి



మహనీయులతో పాటు ఎందరో తెలియని వీరుల ప్రాణత్యాగాలు దాగి ఉన్నాయని గుర్తు చేశారు.ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ పోట్ల గోవింద్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం అనేది కేవలం ఒక అధికారిక వేడుక కాదని, స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను తరతరాలకు గుర్తు చేసే గొప్ప సందర్భమన్నారు. రాజ్యాంగ నిర్మాణానికి ప్రజాస్వామ్యమే పునాదిగా నిలిచిందని, ప్రజల చేత ప్రజల కోసం ప్రజల ద్వార పాలనను అమలు చేయడానికి రాజ్యాంగం మార్గదర్శకంగా ఉందన్నారు.ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ దేశ అభివృద్ధికి తన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం అర్పించి, రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల్లో దేశభక్తి భావనను పెంపొందించేందుకు ప్రత్యేకంగా ప్రసంగాలు నిర్వహించగా, అనంతరం పాల్గొన్నవారికి పలహారాలు పంపిణీ చేశారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించడంతో వేడుకలు మరింత ఉత్సాహంగా సాగాయి.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందుల వెంకటయ్య,టీడీపీ మండల నాయకులు గజ్జవల్లి భాస్కర్, టీడీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ కేశనపల్లి బక్కయ్య, రామారావు, ఇతర పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# కనిగిరి వాసవి వికేఎస్పి క్లబ్ నేతృత్వంలో విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ



**కనిగిరి ఆర్సీ ఇంచార్జి, పెన్ పవర్, జనవరి 26**

పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జరిగిన రిపబ్లిక్ డే దినోత్సవ వేడుకలలో కనిగిరి వాసవి వీకేఎస్పి క్లబ్ నేతృతంలో 10వ తరగతి చదువుతున్న 142 మంది విద్యార్థినీల అందరికీ పరీక్ష ప్యాడ్స్, మరికొన్ని ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి మాట్లాడుతూ వాసవి వీకేఎస్పి క్లబ్, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమని ఆమె అన్నారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి, వాసవి వీకేఎస్పి క్లబ్ కనిగిరి పట్టణ అధ్యక్షులు రాచపూటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు చక్కా బసవేశ్వరరావు, కార్యదర్శి చెన్నా మోహన్, కోశాధికారి కొలిపాకుల కిరణ్, జాయింట్ సెక్రెటరీ పైడిమర్రి బాజీ, పాలువాది, జయరాం, వాసవి క్లబ్ వెలుగురి చంద్ర, రాచర్ల నరేష్, పైడిమర్రి సుబ్బయ్య, వనమా వెంకటేశ్వర్లు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మహిళా పట్టణ కమిటీ కనుమర్లపూడి లక్ష్మీ మోహన్, తాళ్లూరి అరుణ, మునగా శివ, కొలిపాకుల శ్వేత, దేవకి సత్యవతి, కందుకూరి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన బుర్రా మధుసూదన్



**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 26**

మండలంలోని పలువురు నాయకులను కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ సోమవారం వారి గృహాలకు వెళ్లి పరమర్శించారు. మండల కేంద్రమైన గుడ్లూరుకు చెందిన సీనియర్ నాయకులు కోర్నిపాటి రామచంద్రారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకోను చుండగా విషయం తెలుసుకున్న బుర్రా స్వయంగా రామచంద్రారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగితెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. అనంతరం దారకానిపాడు గ్రామానికి చేరుకొని వైసీపీ నాయకులు యరగొర్ల నరసింహారావును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల యరగొర్ల నరసింహారావు తండ్రి యరగొర్ల పెద్దకొండయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బుర్రా దారకానిపాడు వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బుర్రా వెంట తోకల కొండయ్య, గంగిరెడ్డి, కాపులూరి కృష్ణ, గొర్ల రమేష్, కాట్రగడ్డ వెంకట్రావు, కాపులూరి సుబ్బారాయుడు, కాపులూరి మధుసూదన్, కర్పూరపు అశోక్, మోరబోయిన శ్రీరాములు, తాటిపర్తి రమేష్, చిట్టెల సురేష్, పుల్లారెడ్డి, గుడ్లూరు మండలం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రమణయ్యకు ఆర్ధక సహాయం అందజేసిన గంగాసాని హుస్సేన్ రెడ్డి.



**పామూరు, పెన్ పవర్, జనవరి 26**

పట్టణంలోని తూర్పువీధికి చెందిన యనమల రమణయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైసీపీ పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్ రెడ్డి సోమవారం రమణయ్య ను పరామర్శించి, రమణయ్య ఆరోగ్య విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హుస్సేన్ రెడ్డి రమణయ్య కి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయనవెంట వైఎస్ఆర్ సీపీ నాయకులు గట్ల విజయభాస్కర్ రెడ్డి, ఇర్రి కృష్ణారెడ్డి, షేక్ గయాజ్, నాయబ్ రసూల్, తుపాకుల ఆంజనేయుల రెడ్డి, యాట రాఘవేంద్ర, మానం ప్రసాద్, బాల బ్రహ్మం తదితరులు ఉన్నారు.

# వాడ వాడల రెప రెపలాడిన మువన్నెలజండా



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

గిద్దలూరు లో గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని వాడ వాడల మువ్వన్నెల జండా రెప రెపలాడింది . వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఆంజనేయరెడ్డి జాతీయ జండాను ఆవిస్కరించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. అటవి డివిజన్ కార్యాలయంలో డిప్యూటి డైరెక్టర్ నిషాకుమారి, మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ ఈ వి రమణ బాబు, ఎంపిడిఓ కార్యాల యంలో ఎంపిడిఓ సీతారామయ్యా, పోలీసుస్టేషన్ ఏ ఎస్సై జిలాని లు జాతీయ జండాలను ఎగురవేసి గౌరవవందనం స్వీకరించారు. కాకుండా పాఠ శాలల్లో, వసతి గృహాల్లో ఇతర కార్యాలయాల్లో జండాను ఎగురవేసి స్వీట్లను పంపిణీ చేశారు దీంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

## ఘనంగా 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 26**

పట్టణంలోని ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ సిహెచ్ అశోక్ కుమార్ రెడ్డి. మండల మండల పరిషత్ కార్యాలయంలో ప్రసన్న దేవి వ్యవసాయ కార్యాలయంలో ఏవో జవహర్లాల్ నాయక్. బి ఎం డిగ్రీ కాలేజీ చైర్మన్ బట్టు రమణారెడ్డి. పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు ఆయా గ్రామాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

## - వాడ వాడలా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు















**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ జనవరి 26**

77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఒంగోలు నగరంలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పాఠశాలల్లో వివిధ ప్రజాసంఘాల స్వచ్ఛంద సంఘాల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి పోరాటాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్రాన్ని మహనీయుల స్ఫూర్తితో ముందుకు తీసుకుని వెళతామని పలు వక్తలు పేర్కొన్నారు.

**ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో....:** భారత 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు గుంటూరు రోడ్ లోని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి ఒంగోలు శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశ రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుండి పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిందని, ఆ చారిత్రక రోజు నుండి ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలు, హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు గౌరవించాలని కోరారు. ఈ సందర్భంగా మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**జిల్లా కేంద్ర గ్రంధాలయం లో ..:** జిల్లా కేంద్ర గ్రంధాలయం ఒంగోలు నందు ప్రకాశం జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ రిపబ్లిక్ డే సందేశం ఇచ్చారు. తదుపరి, సిబ్బంది కి స్టూడెంట్స్ ,అందరికి రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎఫ్ఏసి జి.వి. శివారెడ్డి, ఇంచార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి, జిల్లా కేంద్ర గ్రంధాలయం ఒంగోలు అభివృద్ధి కమిటీ సభ్యులు చల్ల నాగేశ్వరమ్మ, కార్యాలయ సిబ్బంది కె. కృష్ణ వేణి, డిసిఎల్, కార్యాలయ సిబ్బంది, పాఠకులు, బాలలు శాఖా గ్రంధాలయల గ్రంథ పాలకులు పాల్గొన్నారు.

**క్విస్ విద్యాసంస్థల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవం ..:** ఒంగోలులోని క్విస్ విద్యాసంస్థల్లో 77వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, క్విస్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, వివిధ విభాగాల డీన్ లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా వైకాపా కార్యాలయంలో...:** ఒంగోలు పార్టీ ఆఫీస్ లో 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మెన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇంచార్జ్ చుండూరు రవి, డాక్టర్ మాదాసి వెంకయ్య , వై యం ప్రసాద్ రెడ్డి( బన్నీ), మాజీ ఎమ్మెల్యే.. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కసుకుర్తి. ఆదెన్న, నగర అధ్యక్షులు కఠారి శంకర్, బొట్ల రామారావు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**డి ఆర్ డి ఏ కార్యాలయంలో...:** ప్రకాశం జిల్లా డిఆర్డిఏ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ ఆధ్వర్యంలో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముందుగా పిడి నారాయణ జాతీయ జెండా ఆవిష్కరించి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి ఓ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా పోలీసు కార్యాలయంలో...:** జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీస్ అధికారులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎందరో మేధావులు, త్యాగధనులు అనేక సంవత్సరాల పాటు అహర్నిశలు కృషి చేసి మన దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, డీపీవో ఏవో. రామ్ మోహన్ రావు, సీఐలు,ఆర్ఐలు,ఎస్సైలు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

**జిల్లా జనసేన పార్టీ కార్యాలయం లో... :** ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయం లో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు కంది రవిశంకర్, ఒంగోలు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిట్టెం ప్రసాద్, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు కళ్యాణ్ ముత్యాల,రాయని రమేష్, జనసేన పార్టీ నాయకులు పర్వత రెడ్డి కిషోర్, పల్ల ప్రమీల, ఉంగరాల వాసు, ఆలా నారాయణ, నరసింహ రావు, ఉంగరాల మోహన్, నందు, అల్లూరి శ్రీహరి, మొహమ్మద్ యూనిస్, జగతపి మహేష్,తాళ్లూరి సాయి కుమార్,పసుపులేటి శ్రీధర్,మనోజ్ రాయల్, రాయల మురళి కృష్ణ, శంకరశెట్టి కుమార్,ప్రకాష్ కుంచాల, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**సివియన్ క్లబ్ లో జాతీయ పతాకావిష్కరణ ..:** సివియన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో క్లబ్ అధ్యక్షులు ఈదుపల్లి గురునాధరావు కార్యదర్శి కోడూరి రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు రామిరెడ్డి నితిన్ రాజ్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ తోట సాయి నవీన్, కోశాధికారి ఆరిగ వీర ప్రతాప్, కార్యవర్గ సభ్యులు ఉన్నవ శేషుబాబు, కరేటి కిరణ్ బాబు,యామల బాలకృష్ణ, చక్కా రామకృష్ణారావు, జల్లిపల్లి పూర్ణచంద్రరావు, తోట శ్రీధర్ బాబు, క్లబ్ సీనియర్ సభ్యులు చిల్లర సుబ్బారావు, దేవరశెట్టి సింగయ్య, మిడసల మల్లికార్జున రావు, కుర్రా ప్రసాద్ బాబు, సంత వేలూరి కోటేశ్వరరావు వేముల సాంబమూర్తి, పెండ్యాల సాయి విజయలక్ష్మి, సుహాసిని, రైల్వే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**నగరపాలక సంస్థ కార్యాలయంలో.. :** ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు జాతీయ జెండా ను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, నగర మేయర్ గంగాడ సుజాత నగర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఒంగోలు నగర పాలక సంస్థ తరపున విశ్రాంత భారత సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో..:** కర్నూలు రోడ్డులోని సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘ సేవకులు శ్రీరామ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ పాల్గొని జెండా ఆవిష్కరణ చేసి అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణ, మండవ సుబ్బారావు, షేక్ సర్దార్ భాష, కార్యాలయ సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# 77వ ఘనతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి





**సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 26**

బ్రిటిష్ పాలన నుండి పూర్తిగా విముక్తి పొంది, మన స్వంత పాలన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. సోమవారం శీలంవారిపల్లి లోని కదిరి బాబురావు వ్యవసాయ మరియు ఉద్యాన కళాశాల లో ఘనతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి పాత్ర అనన్యమైనదని ఆయన నేతృత్వంలోని రాజ్యాంగ పరిషత్, దాదాపు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు కష్టపడి, ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించింది. ఇది మన దేశంలోని ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సోదరభావం వంటి ప్రాథమిక హక్కులను అందించిందని అన్నారు.మన దేశం కోసం పోరాడిన మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, జవహర్లాల్ నెహ్రూ వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి వారి కలలను నిజం చేయడానికి మనం కృషి చేయాలని పిలుపు నిచ్చారు .విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు .దేశంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా నష్టపోతున్నారని వ్యవసాయ విద్యార్థులు తమ మేధస్సును ఉపయోగించి రైతులకు సలహాలు సూచనలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు నందించాలని సూచించారు .ఈ కార్యక్రమం లో కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, సర్పంచ్ షేక్ బుజ్జి, మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి,గోను చంద్రశేఖర్ రెడ్డి, టి బాబురావు,టి లక్ష్మి నారాయణ, మస్తాన్ రెడ్డి, నున్నా నారాయణ, కొట్టె శ్రీను,గ్రామ పెద్దలు, విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన ఘనంగా 77వ ఘనతంత్ర దినోత్సవ వేడుకలు




**వలేటివారిపాలెం, పెన్ పవర్ జనవరి 26**

మండలంలోని మండలపరిషత్ కార్యాలయం,తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మరియు వివిధ ప్రభుత్వకార్యాలయాలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో సచివాలయాల్లో. గ్రామగ్రామాన 77 వ ఘనతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు . విద్యార్థులకు సిబ్బందికి ఘనతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి మిఠాయాలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం జనవరి 26 - 1950 అమలులోకి వచ్చింది కావున ప్రతి సంవత్సరం జనవరి 26 ఘనతంత్ర దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహానుభావులను ఈ రోజు స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులతో పాటు విధులను కూడా ప్రతి పౌరుడు నిబద్ధతతో పాటించాలి. చట్టానికి లోబడి జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# పోలీసులను పక్కనపెట్టి వైసీపీని ఎదుర్కొనే దమ్ము టిడిపికి ఉందా

-చంద్రబాబు 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం దేనిలో..? -రైతులపై నిర్బంధం ప్రయోగించి రాజధానికి భూసేకరణ చేస్తున్నావు

-జగన్ హయాంలో రేషన్ డోర్ డెలివరీ చేస్తే నీ హయాంలో గ్రామాల్లో సందు సందున బెల్టు షాపులతో మద్యం డోర్ డెలివరీ చేస్తున్నావు

-అబద్ధాలు ఆడటం లో రాష్ట్ర, జాతీయస్థాయి దాటి ప్రపంచ స్థాయికి ఎదిగావు -పిల్లలకు ఒక సంవత్సరం అమ్మ ఒడి డబ్బులు ఎగ్గొట్టిన చరిత్ర నీది

-నిరుద్యోగులకు పంగనామాలు పెట్టిన ఘనుడవు -19 నెలలలో అన్ని వర్గాలకు అన్యాయం చేసిన చరిత్ర నీది

-ఉడత ఊపులకు భయపడే క్యాడర్ వైసీపీలో లేదు -కమిటీల్లో పనిచేసే ప్రతి కార్యకర్తకు 2.0లో ప్రాధాన్యత

-సేవకుడు లాంటి నాయకుడు బుర్రా మధుసూదన్ -కార్యకర్తల కమిటీ నిర్మాణ అవగాహన కార్యక్రమంలో కాకాని





**కందుకూరు పెన్ పవర్ జనవరి 26:**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఎందులోనో చెప్పాలని మాజీ మంత్రి నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షులు కాకని గోవర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ స్థాయి నిర్మాణ అవగాహన కార్యక్రమం స్థానిక పామూరు రోడ్ లోని వెంగమాంబ కళ్యాణ మండపంలో కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉందన్న చంద్రబాబు నాయుడు దేనిలో స్పష్టంగా చెప్పాలని కాకాని ప్రశ్నించారు. కల్లార్పకుండా అబద్ధాలు ఆడటంలో చంద్రబాబు నాయుడు రాష్ట్ర జాతీయ స్థాయి దాటి ప్రపంచ స్థాయికి ఎదిగాడని, అసహ్యాన్ని జయించిన చంద్రబాబు నాయుడు 23 లక్షల కోట్ల ఉద్యోగాలు కల్పించానని నిర్లజ్జగా మాట్లాడుతున్నాడు. రాష్ట్రంలో వైఎస్ జగన్ పరిపాలనలో ప్రతి ఇంటికి రేషన్ బియ్యాన్ని డోర్ డెలివరీ చేస్తే చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రతి గ్రామములో సందు సందున బెల్ట్ షాపులు పెట్టి మద్యం డోర్ డెలివరీ చేసిన ఘనత సాధించిన దాంట్లో అనుభవం సాధించాడు అని తీవ్రంగా విమర్శించారు. మోడీని కుటుంబం ఉందా అని వ్యంగంగా విమర్శించిన చంద్రబాబు నాయుడు నిసిగ్గుగా మోడీ లాంటి నాయకుడు లేడని మాట మార్చి దేశంలో అసత్యాలు మాట్లాడుతూ తిరుగుతున్నాడని అన్నారు. రాజధాని కోసం రైతులపై నిర్బంధం పెట్టి భూములు సేకరిస్తున్నారు యూరియా కోసం బ్లాక్ మార్కెట్టు ను రైతులు ఆశ్రయించాల్సిన అవసరం కల్పించారు.కౌలు రైతులకు ఒక్క రూపాయి కూడా సాయం చేసిన పరిస్థితి ఈ ప్రభుత్వంలో లేదని అన్నారు. పిల్లల డబ్బులను ఒక్క సంవత్సరం ఎగ్గొట్టి అమ్మ ఒడిని అబాసు పాలు చేసిన దొంగలు వీరు అని అన్నారు. నిరుద్యోగులకు పంగనామాలు పెట్టి నిరుద్యోగ భృతిని ఎగ్గొట్టిన మహా ఘనుడు చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. ఈ 19 నెలల కాలంలో అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురయినారంటే అతిశయోక్తి కాదు అని అన్నారు. నియోజకవర్గంలో పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి కమిటీలు నిర్మాణం చేయాలని రాబోయే జగన్ 2.0 ప్రభుత్వంలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తారని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉడత ఊపులకు భయపడేవారు లేరు దమ్ముంటే తెలుగుదేశం పార్టీ వారు పోలీసులను పక్కనపెట్టి వైసీపీని ఎదుర్కొనే సత్తా ఉందా అని బహిరంగంగా సవాలు విసిరారు. కార్యకర్తకు గుర్తింపు కార్డులు కల్పించి రాబోయే జగనన్న ప్రభుత్వంలో స్థానిక సంస్థల్లో నామినేటి పదవుల్లో అన్నిటిలో సముచిత స్థానం కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి గ్రామము నుండి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు పరిశీలకులు జంకే వెంకటరెడ్డి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు కామినేని సత్యనారాయణ రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షులు అశ్రీత్ రెడ్డి కందుకూరు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు రాష్ట్ర జిల్లా నాయకులు పట్టణ మండలాల నాయకులు అందరూ విరివిగా పాల్గొన్నారు.

## 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డీటీ రామ్ నారాయణ రెడ్డికి ఉత్తమ సేవా ప్రశంస పత్రం



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

మార్కాపురం పట్టణంలో ఘనంగా నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గిద్దలూరు ఎన్ఫోర్స్మెంట్ డీటీ రామ్ నారాయణ రెడ్డిను ఉత్తమ సేవలను గుర్తించి ప్రశంసించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆయనకు ఉత్తమ సేవా ప్రశంస పత్రం అందజేశారు. ప్రజాసేవలో నిబద్ధత, విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రభుత్వ పథకాల అమలులో చురుకైన పాత్ర వంటి అంశాలను గుర్తిస్తూ ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు డీటీ రామ్ నారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైన కొమరోలు హోంగార్డు పీరయ్య

**జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పీరయ్య.**

**ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైన పీరయ్యను అభినందించిన ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ మునాఫ్, పలువురు పోలీసు సిబ్బంది.**



**కొమరోలు పెన్ పవర్ జనవరి 26**

కొమరోలు పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా పనిచేస్తున్న జి పీరయ్య ఉత్తమ సేవ అవార్డుకు ఎంపికయ్యారు. భారత 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్కాపురం జిల్లా స్థాయిలో పలువురు అధికారులు, సిబ్బందిని ఉత్తమ సేవా అవార్డులకు ఎంపిక చేశారు. కొమరోలు పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా పనిచేస్తున్న జి.పీరయ్య సేవలను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు పీరయ్యను ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేశారు. ఆ మేరకు సోమవారం మార్కాపురంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాయింట్ కలెక్టర్ ,సబ్ కలెక్టర్ ,మార్కాపురం డి.ఎస్.పి పీరయ్యకు ఉత్తమ సేవ పురస్కారాన్ని, ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు. తాను ఉత్తమ సేవ పురస్కారానికి ఎంపిక అవుటకు సిఫారసు చేసిన కొమరోలు ఎస్ఐ నాగరాజుకు, గిద్దలూరు రూరల్ సిఐ రామకోటయ్యకు, మార్కాపురం డిఎస్పి నాగరాజుకు పీరయ్య కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైన పీరయ్యను కొమరోలు ఎస్సై నాగరాజు, ఏఎస్ఐ మునాఫ్ ,స్టేషన్ సిబ్బంది అభినందించారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**దొనకొండ జనవరి 26 పెన్ పవర్**

స్థానిక మండలంలోని మండల రెవెన్యూ కార్యాలయం నందు మండల తాసిల్దార్ బి రమాదేవి ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జెండాకు సెల్యూట్ చేసి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో త్యాగాల వలన మనము ప్రశాంతంగా జీవిస్తున్నామని తెలియజేశారు. మండల అభివృద్ధి కార్యాలయం నందు ఎంపీపీ బోరిగొర్ల ఉషా మురళి ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు చేయడం జరిగినది. మహాత్మా గాంధీ బిఆర్ అంబేద్కర్ ఫోటోలకి పూలమాలలు వేయడం జరిగింది. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వసంతరావు నాయక్ మండల విద్యాశాఖ అధికారి సాంబశివరావు వివిధ హోదాలో ఉన్న సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**పామూరు, పెన్ పవర్, జనవరి 26**

మండల కేంద్రమైన పామూరు లోని గుజ్జల యల్లమందరెడ్డి భవన్ ఆవరణలో సోమవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సిపిఐ నాయకులు ఆకుల మోహన్ రావు భారత రాజ్యాంగ శిల్పి, ప్రముఖ న్యాయవేత్త, డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, సిపిఐ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్రం లభించిందని, వారి త్యాగాలను అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు అన్నారు. కాపాడుకుందాం.. కాపాడుకుందాం.. భారత రాజ్యాంగాన్ని అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి,సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, మండల సహాయ కార్యదర్శి పాలపర్తి మస్తాన్ రావు, ఆకుల మోహన్ రావు, సురేష్, మహేష్, సూరిబాబు, వెంకటరెడ్డి సిపిఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## మినీ ఇస్తిమాను తలపించిన కొమరోలు మసీదుల ప్రాంగణాలు

**సోమవారం ఉదయం నమాజుకు కొమరోలు లోని మసీదులకు వేలాదిగా తరలివచ్చిన ముస్లిం భక్తులు.**

**కడపలో మూడు రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన ఇస్తిమా ముగించుకొని తిరుగు ప్రయాణమైన భక్తులు.**

**మార్గమధ్యంలోని కొమరోలులో ని మసీదులలో ఉదయం ఫజర్ నమాజు పూర్తిచేసుకుని బయలుదేరిన తెలంగాణ, ఆంధ్ర ప్రాంత ముస్లింలు.**

**కొమరోలు పెన్ పవర్ జనవరి 26**

సోమవారం ఉదయం నమాజులకు వేలాదిమందిగా భక్తులు తరలిరావడంతో కొమరోలు లోని మూడు మసీదులు భక్తులతో నిండి మినీ ఇస్తిమాను తలపించాయి. కడపలో ఈ నెల 23 ,24,25 తేదీలలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో గొప్ప ఇస్తిమా నిర్వహించారు .ఆ ఇస్తిమాకు ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ముస్లిం వ్యక్తులు ఇస్తిమాకు హాజరయ్యారు. చివరి రోజు ఆదివారం రాత్రి ముగింపు సందర్భంగా భావోద్వేగంతో దాదాపు గంట పాటు జరిగిన దువా లో పాల్గొన్న భక్తులు అనంతరం రాత్రి 10 గంటల నుంచి కడప నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. గుంటూరు ,విజయవాడ, కాకినాడ ,విశాఖపట్నం, మార్కాపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన అనేక జిల్లాల నుంచి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో కొమరోలు మీదుగా ప్రయాణం సాగించారు. అయితే వారు ఉదయం 5 గంటల సమయంలోవారు కొమరోలు చేరటంతో ఉదయం నమాజు ముగించుకొని బయలుదేరాలని నిర్ణయించుకున్నారు. ఆ సందర్భంగా వారు తమ వాహనాలను ఆర్ అండ్ బి రోడ్డు మార్జిన్లలోను, వీధులలోనూ, మసీదుల ఎదురు గల ఖాళీ స్థలాలలోనూ నిలిపి ఉదయం జరిగే ఫజర్ నమాజ్ కు హాజరయ్యేందుకు సిద్ధపడ్డారు. కొమరోలు లోని జామియా మసీదు తో పాటు ఆర్ అండ్ బి రోడ్డు మార్జిన్ లో ఉన్న మసీదు ,సరిరెడ్డిపల్లి కు వెళ్లే దారిలో ఉన్న మసీదుకు వేలాదిగా భక్తులు హాజరయ్యారు. దీనితో మసీదులలో అందరూ ఒక్కసారిగా నమాజులు చేసుకునే అవకాశం లేకపోవడంతో దశలవారీగా నమాజులు పూర్తి చేసుకున్నారు. మసీదులకు హాజరైన భక్తులకు మసీదుల నిర్వాహకులు కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, వుజూ చేయుటకు సౌకర్యం కల్పించారు. ఉదయం నమాజుల అనంతరం భక్తులు వారి ప్రయాణం కొనసాగించారు.



## మేదరమెట్ల జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థి సేవా గుణం

# రూ. 50 వేలతో వాటర్ యూనిట్ ఏర్పాటు



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 26**

కొరిశపాడు మండలం, మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయురాలు టి. అంజనాదేవి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు గ్రామ సర్పంచ్ బి. ఎలిశమ్మ, ఉప సర్పంచ్ ఎమ్. దుర్గారావు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ సందేశాన్ని అందిస్తూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు బాధ్యతల గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి ఆదుర్తి. ప్రసాద్ తన సేవా గుణాన్ని చాటుకున్నారు. తన తల్లిదండ్రులు కీర్తిశేషులు శ్రీ సుబ్బారావు, సుబ్బమ్మల జ్ఞాపకార్థం సుమారు 50 వేల రూపాయల వ్యయంతో 10 ట్యాపులతో కూడిన తాగునీటి యూనిట్ను నిర్మించి పాఠశాలకు వితరణ చేశారు. గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది సమక్షంలో ఈ వాటర్ యూనిట్ను ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యార్థం ముందుకు వచ్చిన ప్రసాద్ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో ఆలీబాబా, జాలయ్య, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎస్. రాజశేఖర్ రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి. ప్రసాద్, ఇతర పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గ వైయస్ఆర్సీపీ విస్తృత స్థాయి సమావేశం - దద్దాల



**పామూరు, పెన్ పవర్ జనవరి 26**

వైయస్ఆర్సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్ఆర్సీపీ సంస్థాగత కమిటీల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు మంగళవారం పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం కనిగిరి వైసీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గం పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదేన్న పాల్గొంటారని దద్దాల తెలిపారు. కావున ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిల్లర్లు, కో-ఆప్షన్ సభ్యులు, రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి వివిధ అనుబంధ విభాగాల సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, పార్టీ అభిమానులు అందరూ హజరై జయప్రదం చేయాలని దద్దాల నారాయణ యాదవ్ కోరారు.

## అల్లినగరం హైస్కూల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




**కొమరోలు పెన్ పవర్ జనవరి 26**

కొమరోలు మండలం అల్లినగరంలో గల మునగనూరి వెంకట సుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్లో సోమవారం భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ అధ్యక్షత వహించగా ,ఆ గ్రామ సర్పంచ్ బంగారు రత్నాలు, పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ స్వర్ణ ప్రవీణ్ ,ఆ గ్రామ పెద్ద షేక్ సత్తార్ ,పాఠశాల స్థలదాత స్వర్గీయ మునగనూరి వెంకటసుబ్బయ్య కుమార్తె సావిత్రి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జాతీయ జెండాను సర్పంచి బంగారు రత్నాలు ఆవిష్కరించగా, గణతంత్ర దినోత్సవ ఆవశ్యకతను ప్రధానోపాధ్యాయులు మామిడి పద్మజ, పలువురు ఉపాధ్యాయులు వివరించారు .గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలోని విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందించి అభినందించారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు జనార్ధన్ రాజు, పిచ్చయ్య ,శివరాం, చంద్రమోహన్, హరి కుమార చౌదరి , కృష్ణమూర్తి ,ఆదిలక్ష్మి, శ్రీనివాసులు ,బోధ నేతర సిబ్బంది ఫకీరయ్య ,అశ్విని దేవి ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కందుకూరులో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా









జాతీయ జెండాను ఎగురవేశారు.

**కందుకూరు పెన్ పవర్ జనవరి 26**

కందుకూరులోని ప్రభుత్వ కార్యాలయం పైన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల పైన మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, డిఎస్పీ కార్యాలయంలో సబ్ కలెక్టర్ హిమవంశి, టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ షేక్ అన్వర్ బాషా, ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ ఉషారాణి, మున్సిపల్ కార్యాలయం, అన్న క్యాంటీన్లో మున్సిపల్ కమిషనర్ అనూష, ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో డాక్టర్ ఇంద్రాణి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రత్నజ్యోతి, ఎంఆర్సి కార్యాలయంలో ఎంఈఓ సుబ్బారెడ్డి, నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డైరెక్టర్ షాలిని రెడ్డి శ్రీ శివ సాయి పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ ఓరుగంటి శివరామయ్య విజ్ఞాన్ విహార్ స్కూల్లో కరస్పాండెంట్ ఘట్టమనేని హరిబాబు గౌతమ్ పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ మాలకొండయ్య, ఉద్యానవన కళాశాలలో డీన్,

## ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ జనవరి 27**

మార్కాపురం మండలం దరిమడుగులోని ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వి.హెచ్.ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి దేశ జాతీయ జెండాను ఎగురావేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి భారతదేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మారిన రోజును స్మరించుకుంటు ఇది దేశానికి పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి లభించిన రోజు అని ఆయన అన్నారు. దేశ స్వాతంత్రం కోసం అనంతరం పోరాడిన మహనీయులను గుర్తు చేసుకొన్నారు.రాజ్యాంగం అమల్లోకి రావడంతో భారతదేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్ర గణతంత్ర దేశంగా భారతదేశం రూపొందిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.శంకర్ బాబు, కళాశాల డీన్ డాక్టర్. చంద్ర రేఖ , డిప్లమా కళాశాల ఇన్చార్జి మాధవి, ఫార్మసీ, నర్సింగ్, వివిధ విభాగాల హెచ్.ఓ.డి లు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎబిసిడబ్ల్యుగా దమ్మాల హరిప్రసాద్



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

గిద్దలూరు బిసి సహాయ సంక్షేమాధికారి దమ్మాల హరిప్రసాద్ ఉత్తమ అవార్డును మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా గణతంత్ర వేడుకల్లో అందుకున్నారు. హరిప్రసాద్ హాస్టల్ వెల్ఫేర్ గా బిసి వెల్ఫేర్ లో 19 91 ఉద్యోగ బాధ్యతలు చేపట్టి అంచలంచలు ఎదిగి బిసి సహాయ వెల్ఫేర్ ఆఫీసర్ గా పదోన్నతి పొందారు. వసతి గృహ సంక్షేమాధికారి గా, వసతిగృహాల్లో పలు సేవలను అందించారు, ఎబిసిడబ్ల్యు పదోన్నతి పొందిన అనతికాలంలోనే వసతిగృహాల అభివృద్ధి కి ఎంతో పట్టుబడుతున్నారు. నీతిగా, నిజాయితీగా వసతి గృహ సంక్షేమాధికారులను కలగొలుపుతూ తనదైన శైలిలో చక్కగా విధులు నిర్వహిస్తున్నారు. వీటన్నిటిని పరిగణలోకి తీసుకుని హరిప్రసాద్ ను ఉత్తమ బిసి సహాయ సంక్షేమాధికారిగా ఎంపిక చేశారు . ఈ నేపథ్యంలో హరిప్రసాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా అవార్డును అందుకున్నారు.

## అయ్యవారిపల్లి లో ఘనంగా గణతంత్ర దినోత్సవం




**వలేటివారిపాలెం, పెన్ పవర్, జనవరి 26**

అయ్యవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1950 జనవరి 26వ తేదీన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజుని పూర్తి సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. ప్రజలకు పూర్తి స్వాతంత్రం హక్కులు ,స్వేచ్ఛ అందరికీ స్వాతంత్ర ఫలాలు అందాలని చట్టాలను రూపొందించి ప్రజలకి స్వేచ్ఛ అనే హక్కును ప్రసాదించిన రోజు గణతంత్ర దినోత్సవం అన్నారు. కావున దేశవ్యాప్తంగా జనవరి 26 నా గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆటల , పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, హనుమంతరావు, వెంకట్రావు, రజిత, పాఠశాల చైర్మన్ మంచాల మాలకొండ్రాయుడు, సర్పంచ్ దేగా వెంకటేశ్వర్లు అంగన్వాడి టీచర్లు సుమలత , శిరీష పాల్గొన్నారు.

## పామూరు తాసిల్దార్ శ్రీరామచంద్రుని వాసుదేవరావుకు ప్రశంసా పత్రం

**పామూరు, పెన్ పవర్, జనవరి 26**

77వ జాతీయ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని పామూరు మండల తహశీల్దార్ శ్రీరామచంద్రుని వాసుదేవరావు సోమవారం స్వీకరించారు. వాసుదేవరావు కు పలువురు నాయకులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



# ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 26**

మండలంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్ స్టేషన్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయం స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా కార్యాలయం ఆవరణలో జాతీయ జెండా ఎగరవేసి జెండా వందనం సమర్పించారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటైన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులుగా ఉన్నప్పుడే మంచి పౌరులుగా తయారు కావాలని మంచి పౌరులు ఉన్న సమాజం శక్తివంతమైనటువంటి దేశంగా ఏర్పడుతుందని మంచి అలవాట్లను పెంపొందించుకొని బాగా చదువుకోవాలని తెలియపరిచారు. ఎంఈఓ రవిచంద్రబాబు మాట్లాడుతూ మన దేశం గొప్ప ఆర్థిక వ్యవస్థగా ఎదగటానికి మనకున్న ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రధాన కారణమని ప్రతి ఒక్కరు రాజ్యాంగ విలువలు కాపాడాలని హితవు పలికారు. అనంతరం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు దేశభక్తి గేయాలకు నృత్య ప్రదర్శన చేశారు. తదుపరి రిపబ్లిక్ డే సందర్భంగా జరిగిన ఆటల పోటీలు పలు రకాలైనటువంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి తరఫున బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారవు ఎంపీడీఓ సుజాత ఎస్సై సత్యనారాయణ గ్రామ వైస్ సర్పంచ్ మండవ మురళి, జెడ్పిటిసి సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు పల్లపోతు ప్రసాదు, మండవ రామయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చెన్నాయపాలెం యానాది, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పొన్నలూరు బ్రాంచ్ మేనేజర్ ఎస్ కె ఫిరోజ్ బాషా, పల్లపోతు రమేష్ పాఠశాల విద్యా కమిటీ సభ్యులు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది యేసు రత్నం, శ్రీనివాసాచారి, కోటేశ్వరరావు, రమాదేవి ఝాన్సీ లక్ష్మి, ఫాతిమా అంజిరెడ్డి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## స్ప్రింగ్ బోర్డు స్కూలులో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




**గిద్దలూరు పెన్ పవర్ జంవవరి 26**

గిద్దలూరు లో స్థానిక స్ప్రింగ్ బోర్డు పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డా.జె.వి.నారాయణ, డైరెక్టర్ మణి చైతన్య ప్రిన్సిపాల్ జాడి శ్వేత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించి భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్తో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డా.జె.వి.నారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలే దేశ బలమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ జాడి శ్వేత మాట్లాడుతూ మీరు కష్టపడి చదివి మంచి స్థాయికి చేరుకొని మీ గ్రామం, మీ కుటుంబం, మీ పాఠశాల పేరు గర్వంగా నిలబడేలా ఎదగాలని. క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడే స్వభావమే నిజమైన బలమని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు, ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతిబింబించే నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో దేశభక్తి భావం పెంపొందించేలా కార్యక్రమాలు సాగాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు .

## పొదిలిలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**పొదిలి, పెన్ పవర్, జనవరి 26**

పొదిలిలో సోమవారం నాడు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రైవేటు విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ షాజిదాతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పొదిలి నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ మారుతి రావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కరిమున్ బీబీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు



పాల్గొన్నారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ వై వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎందరో మహనీయులు స్వాతంత్రం కోసం చేసిన పోరాటాలు, త్యాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ మండలం వ్యవసాయాధికారిగా విజయభాస్కర్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

గిద్దలూరు మండలం వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఉత్తమ సహాయ మండలాధికారిగా ఎంపికయ్యారు. సోమవారం నాడు గణతంత్ర వేడుకల సందర్భంగా మార్కాపురంలో జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డునుఅందుకున్నారు . భాస్కర్ రెడ్డి సేవలను గుర్తించి ఈ అవార్డును బహుకరించారు.



## పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన సమాజం



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 26:**

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అద్దంకి మండలం, మణికేశ్వరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం నాడు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గ్రామస్తులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ తెదేపా నేత షేక్. కరిముల్లా మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచాలని, గ్రామాభివృద్ధిలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు తాము అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కాలనీ ప్రజలే తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితో పాటు స్థానిక నాయకులు మాథ్యూస్, గండి. శ్రీను, నాగయ్య, ప్రకాష్, ఎలీజర్, అంజయ్య, ఎస్సీ కాలనీ యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే క్రిమినల్ కేసులు నమోదు.

### ఎస్సై. జీ.సుబ్బారావు.



**ఉలవపాడు, పెన్ పవర్, జనవరి 26**

ఉలవపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా బహిరంగంగా మద్యం సేవిస్తూ పట్టుబడితే అటువంటి వారిపై కఠిన చర్యలతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్థానిక ఎస్సై జీ.సుబ్బారావు సోమవారం తెలిపారు. మండలంలోని రామాయపట్నం రిసార్ట్ వద్ద, పాత బంగ్లా మరియు బీచ్ వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న ప్రదేశాలపై ఉలవపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగే ప్రదేశాలను గుర్తించి స్థానికుల సాయంతో శుభ్రం చేయించి, అక్కడ ఉన్న చెత్తాచెదారాలను తగలబెట్టించారు. రామాయపట్నం బీచ్ పరిసర ప్రాంతాలు, పాత బంగ్లా, అటవీ ప్రాంతాల్లో ఎవరైనా మద్యం తాగి పట్టుపడితే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేసినా, మద్యం మత్తులో వాహనాలను వేగంగా నడిపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-112 కి సమాచారం ఇవ్వాలని ఎస్సై సుబ్బారావు తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. కాబట్టి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి పోలీసులు చట్టపరంగా తీసుకొను చర్యలకు బాధ్యులు కావద్దని ఎస్సై సుబ్బారావు తెలియజేశారు.



# బి.ఆర్ ఆక్స్ ఫర్డ్‌లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు




**కందుకూరు పెన్ పవర్, జనవరి 26**

పట్టణంలో గల బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాల లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ సుబ్బారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని, క్రమశిక్షణతో చదువుకోవడమే కాకుండా చిన్నప్పటినుంచే దేశభక్తిని అలవర్చుకొని విద్యార్థులంతా బాధ్యతగల పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు.విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయల త్యాగాలకు అనుగుణమైన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలియజేశారు.డైరెక్టర్ జి.బాల భాస్కరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యమే గుర్తింపుగా, రాజ్యాంగమే మన మార్గదర్శకంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు, ఎన్సిసి విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు ఆకర్షణీయంగా నిలిచాయి.అలాగే స్పోర్ట్స్ మీట్ లో గెలిచిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది.అనంతరం విద్యార్థులకి మిఠాయిలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బెజవాడ నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీఎంశ్రీ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు




**కనిగిరి ఆర్సీఇంచార్జి, పెన్ పవర్, జనవరి 26**

పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికోటత పాఠశాలలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. పాఠశాలలోని మహాత్మా గాంధీ విగ్రహానికి, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగ పద్మజ, లక్ష్మి, రషీదా, సాయిలక్ష్మి, గౌతమి, రమణయ్య, శ్రీనివాసులు, గోపి, ఏవి నారాయణ, సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి, పద్మలత, నాగమణి, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లూరులో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 26**

మండల కేంద్రమైన గుడ్లూరులో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్, ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు, పోలీస్ స్టేషన్ లో ఎస్సై వి.వెంకట్రావు, రెవిన్యూ కార్యాలయంలో తహశీల్దార్ బాల కిషోర్, గ్రంథాలయంలో గ్రంథపలకులు ఎల్.ప్రభాకర్ రెడ్డి, పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ పాలకీర్తి శంకర్, వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్లు జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, శివాలయంలో రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహానికి తహశీల్దార్ బాలకిషోర్ దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొత్తంగా మండల కేంద్రంతో పాటు, మండలం పరిధిలో అన్నీచోట్ల ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు తదితరచోట్ల గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, మిఠాయిలు పంచి పెట్టారు.

## ఉపాధిహామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని

# అంబేద్కర్ విగ్రహానికి అర్జీ ఇచ్చిన వ్యవసాయ కార్మికసంఘం

**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 26**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని గుడ్లూరు వ్యవసాయ సంఘం సభ్యులు సోమవారం అర్జీ అందజేశారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఎం సీనియర్ నాయకులు దామా కృష్ణయ్య పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తీసేయడం సరైనది కాదని అన్నారు. ఆ స్థానంలో విబిజి రాంజీ అనే పేరుతో బిల్లు తీసుకురావడం వల్ల పేదలు కష్టాల పాలు అవుతున్నారని ఆయన అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పని హక్కును, జీవించే హక్కును ప్రాథమిక సూత్రాల్లో చేర్చారని, కానీ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి, కొత్త చట్టం తీసుకొచ్చి, ఉపాధి కూలీల కడుపు కొడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వి బి జి రాంజీ పథకాన్ని రద్దుచేసి, ఉపాధిహామీ పాత పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్ గారు మీరైనా మా అర్జీని స్వీకరించి, కేంద్ర ప్రభుత్వ మనసు మార్చి ఉపాధి కూలీలను ఆదుకోవాలని, అంబేద్కర్ విగ్రహానికి అర్జీని ఇవ్వడమైనదని వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.సుభాన్, పొట్లూరి తిరుమలరావు, కందుకూరి కళ్యాణి, పొట్లూరి కోటమ్మ, సన్యాసి బాలకోటయ్య, సిఐటియు మండల కన్వీనర్ కొట్టే వెంకయ్య, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి గుత్తి మల్లికార్జున, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, కారసాల బ్రహ్మానాయుడు, రైతు నాయకులు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాణికల అనూష తదితరులు పాల్గొన్నారు.



# చెంచు గిరిజన మహిళలకు ఉచిత ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

## తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఎరిక్షన్ బాబు



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 26**

మండల పరిధిలోని చింతల తుమ్మల బైలు మర్రిపాలెం చెంచు గిరిజన గ్రామమునందు ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం దోర్నాల శివమణికంఠ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొని మహిళలకు గ్యాస్ స్టవ్ల సిలిండర్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రావికింది లక్ష్మీనరసింహారావు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి. రావి క్రింది సుబ్బరత్నం. తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు షేక్ మాబు. చంటి ఒంటేరు రాఘవ. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ సిఆర్ఎంటీ పురస్కారం అందుకున్న రమణారెడ్డి



**కందుకూరు పెన్ పవర్ జనవరి 26**

77 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ సిఆర్ఎం టీచర్గా గా కందుకూరు మండలానికి చెందిన ఎం.వి రమణారెడ్డి ఎంపికయ్యారు. సోమవారం నెల్లూరు జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. బాలాజీ రావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య చేతుల మీదగా జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఉద్యోగ బాధ్యతలు నిబద్ధతతో నిర్వర్తించినందుకు తమకు ఉత్తమ సేవా పురస్కారం లభించినట్లు పురస్కార గ్రహీత తెలిపారు. జిల్లా స్థాయి అవార్డుకు ఎంపిక చేసినందుకు జిల్లా, మండల స్థాయి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జిల్లా ఉత్తమ అకౌంటెంట్‌గా కందుకూరు ఎంఈఓ కార్యాలయంలో పనిచేసే కె. శ్రీలక్ష్మి, ఉత్తమ డ్రాయింగ్ టీచర్గా కందుకూరు బాలుర హైస్కూల్ లో పనిచేస్తున్న ఎం వెంకటేశ్వర్లు పురస్కారానికి ఎంపికై డిఈవో బాలాజీ రావు చేతుల మీదుగా సోమవారం పురస్కారం అందుకున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న రమణారెడ్డి, శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు ను ఎం ఈఓలతో పాటుగా సహచర ఉద్యోగులు, మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# ఉత్తమ సి సి గా వెంకటరెడ్డి



**పొదిలి, పెన్ పవర్, జనవరి 26**

మండలంలోని వెలుగు డిఆర్డిఏ లో సి సి గా పనిచేస్తున్న వెంకటరెడ్డి ఉత్తమ సిసిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం నాడు మండల కేంద్రమైన మార్కాపురంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సీసీగా వెంకటరెడ్డి ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆయనకు అవార్డు దక్కింది. అవార్డు అందుకున్న వెంకటరెడ్డిని పొదిలి వెలుగు డిఆర్డిఏ ఏపిఎం గోపాలకృష్ణ తో పాటు ఇతర సీసీలు, వివో ఏలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# అద్దంకి పోలీస్ స్టేషన్లో ఘనంగా గణతంత్ర వేడుకలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన సీ.ఐ సుబ్బరాజు



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 26**

అద్దంకి పట్టణంలోని పోలీస్ స్టేషన్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా సీ.ఐ సుబ్బరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వేచ్ఛా వాయువులను ప్రసాదించి, రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన హక్కులను వినియోగించుకుంటూనే, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తుందని, రాజ్యాంగ బద్ధంగా శాంతిభద్రతలను కాపాడటమే లక్ష్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ వేడుకల్లో ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# జగనన్నను సీఎం చేయడమే లక్ష్యం

## కార్యకర్తల సమావేశంలో అన్నా రాంబాబు




**మార్కాపురం పెన్ పవర్ జనవరి 26**

ప్రతి నాయకుడు, కార్యకర్త వైయస్ జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని మార్కాపురం వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాంబాబు అన్నారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వార్డు నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గం ఇంచార్జ్ అన్నా రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో పార్టీ పరిశీలకులను నియమించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ గెలుపు కొరకు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సింది బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కృష్ణ చైతన్య, మార్కాపురం పట్టణ అధ్యక్షులు షేక్ సలీం, మున్సిపల్ చైర్మన్.మున్సిపల్ వైస్ చైర్మన్,వార్డు కౌన్సిలర్లు,వార్డు ఇన్చార్జిలు,అధ్యక్షులు అనుబంద విభాగాలలో ఉన్న వివిధ హోదాలో ఉన్న పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా గణతంత్ర వేడుకల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 26**

నూతన మార్కాపురం జిల్లా కేంద్రంలోని ఎస్వీకెపి కళాశాల ప్రాంగణంలో ఘనంగా "గణతంత్ర దినోత్సవ" వేడుకలు ఘనంగా జరిగాయి .నూతనంగా ఏర్పాటైన జిల్లాకేంద్రంలో తొలిసారి గణతంత్ర వేడుకలు జారిగాయి . ఈవేడుకల్లో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ,నృత్య , నాటక ప్రదక్షణ లను తిలకించి బహుమతులు అందజేశారు. తొలి వేడుకలు కావటంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.



# మండల యువజన విభాగం ఉపాధ్యక్షులుగా ఆవుల రామకృష్ణ



**పామూరు, పెన్ పవర్, జనవరి 26.**

కనిగిరి వైసీపీ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం వైయస్ఆర్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం పామూరు మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయి పార్టీ అనుబంధ విభాగాల నియామకాల గురించి వారితో చర్చించారు. అనంతరం అందరి ఏకాభిప్రాయం మేరకు మండలం పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షులుగా బోట్లగూడూరు కు చెందిన ఆవుల రామకృష్ణను ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ప్రకటించారు. సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దద్దాల చూసించారు. యువజన విభాగం ఉపాధ్యక్షుడుగా నియమితులైన సందర్భంగా రామకృష్ణ కు దద్దాల నారాయణ యాదవ్ , మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్ రెడ్డి, శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువతో సన్మానించారు. ఈ అవకాశం కల్పించినందుకు దద్దాల నారాయణ యాదవ్ మరియు మండల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరున రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటక తిరుపతి రెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి, కటికల వెంకటరత్నం, శ్రీరామ శ్రీనివాసులు, ఎలిక అచ్చయ్య, తలపుల రాజశేఖర్, ఆవుల భాస్కర్,నల్లబోతుల నాగరాజు, ఆవుల నవీన్, దొడ్డ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# భారత గణతంత్ర దినోత్సవం వేడుకలో పాల్గొన్న గంగసాని లక్ష్మీ

## మహనీయుల అడుగు జాడల్లో నడవాలి

**పామూరు, పెన్ పవర్, జనవరి 26**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జండా వందనం కార్యక్రమంలో పాల్గొని జండాను ఎంపీపీ గంగసాని లక్ష్మి ఎగరవేశారు. వైస్ ఎంపీపీ. గంధం ఏసు రత్నం, ఎంపీటీసీ ఎంత చెప్పి. పోలినేని శ్రీనివాసులు, కో ఆప్షన్ నాయబ్ రసూల్, ఎంపీడీవో. లక్ష్మీనారాయణ గుప్తా, డిప్యూటీ ఎంపీడీవో. హజ్రత్ అలీ, అధికారులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# రోహిత్‌ను వెనక్కి నెట్టి సూర్య టాప్‌కు.. కెప్టెన్సీలో టీమిండియా కెప్టెన్ వరల్డ్ రికార్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలోని టీమిండియా టీ20 జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తుంది. రోహిత్ శర్మ తర్వాత భారత టీ20 పగ్గాలు చేపట్టిన సూర్య జట్టును సక్సెస్ ఫుల్ గా నడిపిస్తున్నాడు. ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా జట్టుకు విజయాలను అందిస్తున్నాడు. ఆడేది సొంతగడ్డపై అయినా.. విదేశీ గడ్డపై అయినా భారత టీ20 జట్టును ఓడించాలంటే ప్రపంచంలోని ఏ జట్టుకైనా శక్తికి మించిన పని.

రెండేళ్లుగా ఇండియా టీ20 ఫార్మాట్ లో తిరుగు లేని జట్టుగా నిలిచింది. ముఖ్యంగా సూర్య కుమార్ యాదవ్ సారధ్యంలో జట్టు ఓ రేంజ్ లో ఆడుతుంది. కెప్టెన్సీ చేపట్టినప్పటి నుంచి బ్యాటర్ గా విఫలమైన సూర్య నాయకత్వంతో జట్టుకు విజయాలను అందిస్తూనే ఉన్నాడు.

సూర్య కెప్టెన్సీలో ఇండియా ఆసియా కప్ గెలుచుకుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ను 2-1 తేడాతో జయభేరి మోగించింది. 2025 ఏడాది చివర్లో సౌతాఫ్రికాపై ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను 3-1 తేడాతో నెగ్గింది. ప్రస్తుతం న్యూజిలాండ్ తో జరుగుతున్న 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ఇండియా రెండు మ్యాచ్ లు మిగిలి ఉండగానే 3-0 తో సిరీస్ కైవసం చేసుకుంది. ఆదివారం (జనవరి 25) కివీస్ తో జరిగిన మ్యాచ్ లో ఇండియా 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సూర్య ఖాతాలో ఒక వరల్డ్ రికార్డ్ వచ్చి చేరింది. అంతర్జాతీయ టీ20 కెప్టెన్ గా తొలి 40 మ్యాచ్ ల్లో అత్యధిక మ్యాచ్ లు గెలిపించిన కెప్టెన్ గా సూర్య రికార్డ్ సృష్టించాడు. ఇండియా టీ20 కెప్టెన్ గా సూర్య 40 మ్యాచ్ ల్లో 32 విజయాలను అందించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (31), ఆఫ్ఘనిస్తాన్ మాజీ కెప్టెన్ అస్గహార్ ఆఫ్ఘన్ (31) లను వెనక్కి నెట్టాడు. వరల్డ్ కప్ ముందు ఇండియాకు విజయాలను అందించడమే కాదు టాప్ ఇన్నింగ్స్ ఆడుతూ సూపర్ ఫామ్ లోకి వచ్చాడు. ఇటీవలే కివీస్ తో ముగిసిన మూడు టీ20 మ్యాచ్ ల్లో సూర్య బ్యాటింగ్ లోనూ చెలరేగాడు. మరి కెప్టెన్ గా సూర్య మరిన్ని రికార్డ్స్ బ్రేక్ చేస్తాడో చూడాలి.

# శాంసన్‌కు చెక్.. వరల్డ్ కప్‌లో టీమిండియా ఓపెనర్లుగా ఆ ఇద్దరూ ఫిక్స్

**2026 వరల్డ్ కప్ కు 10 రోజుల సమయం మాత్రమే ఉంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిధ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ నెలకొంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ఇండియాలోనే జరుగుతుండడంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టైటిల్ నిలబెట్టుకుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. ఓ వైపు న్యూజిలాండ్ తో టీ20 సిరీస్ జరుగుండగానే మరోవైపు వరల్డ్ కప్ లో టీమిండియా ఓపెనర్లు ఎవరనే విషయంలో చర్చ సాగుతోంది. వరల్డ్ కప్ లో టీమిండియా ఓపెనర్లు ఎవరో ఇప్పుడు చూద్దాం..**



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో సిరీస్ ముందువరకు వరల్డ్ కప్ కు ఓపెనర్లు కన్ఫర్మ్ అయ్యారు. అభిషేక్ శర్మతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ దిగడం ఖాయమనుకున్నారు. అయితే ప్రస్తుతం కివీస్ తో జరుగుతున్న టీ20 సిరీస్ చూస్తే శాంసన్ వరల్డ్ కప్ లో ఆడే అవకాశాలు కనిపించడం లేదు. శాంసన్ పేలవ ఫామ్ ఇందుకు కారణం. న్యూజిలాండ్ తో ఇప్పటివరకు జరిగిన మూడు టీ 20 మ్యాటిక్ ల సిరీస్ లో శాంసన్ ఘోరంగా విఫలమయ్యాడు. మూడు మ్యాచ్ ల్లో కలిపి 16 పరుగులే చేసి పూర్తిగా నిరాశపరిచాడు. మరోవైపు ఇషాన్ కిషాన్ మాత్రం తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నాడు. తొలి టీ20లో 8 పరుగులే చేసి విఫలమైనా రెండో టీ20 లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 32 బాల్స్‌లోనే 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 76 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఆదివారం (జనవరి 25) జరిగిన మూడో టీ20లోనూ 12 బంతుల్లోనే 28 పరుగులు చేయి జట్టుకు మెరుపు ఆరంభం ఇచ్చాడు. కిషాన్ దూకుడు చూస్తుంటే వరల్డ్ కప్ ప్లేయింగ్ 11లో స్థానం దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిలక్ వర్మ జట్టులోకి వస్తే కిషన్ లేదా శాంసన్ లలో ఒకరు తప్పుకోవాలి. దీని ప్రకారం ఫామ్ లో ఉన్న కిషాన్ ను అభిషేక్ శర్మతో ఓపెనింగ్ కు పంపొచ్చు.

# ప్లేయర్ అంటే ఇలా ఉండాలి: వెనక్కి డైవ్ చేస్తూ పాండ్య సూపర్ మ్యాన్ క్యాచ్..




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో జరిగిన మూడో టీ20లో టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య తన ఫీల్డింగ్ విన్యాసాలతో ఆశ్యర్యపరిచాడు. ఆదివారం (జనవరి 25) గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఒక స్టన్నింగ్ క్యాచ్ లో మైండ్ పోగొట్టాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ లోనే ఈ సీన్ చోటు చేసుకుంది. హర్షిత్ రానా వేసిన బంతిని కాన్వే మిడాఫ్ దిశగా ఆడాడు. టైమింగ్ మిస్ కావడంతో బంతి అక్కడే గాల్లో లేచింది. మిడాన్ లో ఫీల్డింగ్ చేస్తున్న పాండ్య వెనక వైపు నుంచి డైవ్ చేసి క్యాచ్ అందుకున్నాడు. హార్దిక్ పాండ్య పట్టిన క్యాచ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మ్యాచ్ లో తొలి ఓవర్ లో అద్భుతమైన క్యాచ్ అందుకున్న పాండ్య రెండో ఓవర్లో ఒక వికెట్ తీసుకున్నాడు. క్రికెట్ లో 3ణ ప్లేయర్ అంటే ఎలా ఉండాలో పాండ్య చూపించాడు. బ్యాటింగ్ లో అవకాశం వచ్చినప్పుడు దుమ్ములేపే పాండ్య బౌలింగ్ లోనూ రాణిస్తున్నాడు. ఈ రెండింటితో పాటు తన ఫీల్డింగ్ విన్యాసాలతో అబ్బురపరుస్తున్నాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే న్యూజిలాండ్ తో జరిగిన మూడో టీ20లో టీమిండియా విశ్వరూపం చూపించింది. ప్రత్యర్థి కివీస్ ను పసికూనగా మార్చేసి చిత్తుచిత్తుగా ఓడించారు. 154 పరుగుల టార్గెట్ ను కేవలం 10 ఓవర్లలోనే ఫినిష్ చేశారు. ఓపెనర్ అభిషేక్ శర్మ (20 బంతుల్లో 60: 7 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (26 బంతుల్లోనే 57: 6 ఫోర్లు, 3 సిక్సర్లు) విశ్వ రూపం చూపించి కివీస్ కు ఘోరమైన పరాభవాన్ని మిగిల్చారు. ఆదివారం (జనవరి 25) గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో ముగిసిన ఈ మ్యాచ్ లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. బౌలింగ్ లో బుమ్రా, బిష్ణోయ్ చెలరేగేడంతో పాటు బ్యాటింగ్ లో అభిషేక్ చుక్కలు చూపించి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఛేజింగ్ లో ఇండియా మూడు వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. ఈ విజయంతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ను ఇండియా మరో రెండు మ్యాచ్ లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది.

# నిఖిల్.. ప్రతీసారి ఇలానే..







టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే ఒక వింతైన, ఆసక్తికరమైన సెంటిమెంట్ కనిపిస్తుంది. సాధారణంగా సినిమా వాయిదా పడితే అంచనాలు తగ్గిపోతాయని, నెగిటివ్ బజ్ వస్తుందని అందరూ భయపడతారు. కానీ నిఖిల్ విషయంలో మాత్రం కథ పూర్తిగా రివర్స్. ఆయన సినిమా ఎప్పుడు లేట్ అయితే అప్పుడు అది బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ హిట్ గా నిలుస్తోంది. 'స్వామిరారా' సినిమా నుండి మొదలైన ఈ 'డిలే' సెంటిమెంట్ ఇప్పటికీ కంటిన్యూ అవుతుండటం విశేషం.

నిఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పిన 'స్వామిరారా' విడుదల కావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. చాలా కాలం ల్యాబ్‌లోనే ఉండిపోయిన ఆ సినిమా తీరా థియేటర్లకు వచ్చాక సంచలన విజయం సాధించింది. ఆ తర్వాత వచ్చిన 'కార్తికేయ', 'సూర్య వర్సెస్ సూర్య' చిత్రాలు కూడా అనుకున్న సమయానికి రాకుండా వాయిదా పడినా సరే, బాక్సాఫీస్ దగ్గర మాత్రం నిఖిల్ కు మంచి వసూళ్లు తెచ్చిపెట్టాయి. ఈ క్రమంలో నిఖిల్ సినిమాల వాయిదా అనేది ఒక పాజిటివ్ సైన్ గా మారిపోయింది. ముఖ్యంగా 'అర్జున్ సురవరం' సినిమా పరిస్థితి చూస్తే ఈ సెంటిమెంట్ ఎంత స్ట్రాంగ్ గా ఉందో అర్థమవుతుంది. దాదాపు ఏడాదిన్నర కాలం వాయిదా పడుతూ వచ్చిన ఈ మూవీ, చివరికి థియేటర్లలోకి వచ్చి హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత పాన్ ఇండియా రేంజ్ లో హిట్ అయిన 'కార్తికేయ 2' కూడా అనేకసార్లు వాయిదా పడి రిలీజ్ అయ్యింది. ఫలితం ఏంటో మనందరికీ తెలిసిందే. అలాగే 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '18 పేజెస్' కూడా ఇదే బాటలో నడిచి నిఖిల్ ఖాతాలో హిట్లుగా చేరాయి. ప్రస్తుతం నిఖిల్ తన 20వ చిత్రం 'స్వయంభూ'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా ఫిబ్రవరిలో రిలీజ్ కావాల్సి ఉన్నా, గ్రాఫిక్స్ పనుల కోసం ఏప్రిల్ 10కి వాయిదా పడింది. గ్రాండ్ విజువల్స్ కోసం మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు నిఖిల్ పాత సెంటిమెంట్‌ను గుర్తు చేస్తోంది. సినిమా లేట్ అయింది కాబట్టి ఈసారి కూడా పక్కా హిట్ కొట్టబోతున్నారనే చర్చ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో మొదలైంది. ఈ సెంటిమెంట్ వెనుక అసలు రహస్యం నిఖిల్ తీసుకునే జాగ్రత్తలే అని చెప్పాలి. సినిమా అవుట్‌పుట్ సంతృప్తికరంగా లేకపోతే ఆయన రిలీజ్ చేయడానికి అస్సలు ఒప్పుకోరు. క్వాలిటీ కోసం ఎంత కాలమైనా వెయిట్ చేయడం ఆయనకు అలవాటు. అందుకే లేట్ అయినా సరే, థియేటర్లో ఆడియన్స్ కు ఒక పర్ఫెక్ట్ సినిమా అందుతుంది. నేటి జనరేషన్ ఆడియన్స్ కూడా కంటెంట్ బాగుంటే సినిమా ఎప్పుడు వచ్చినా ఆదరిస్తారని నిఖిల్ సినిమాలు ప్రూవ్ చేస్తున్నాయి. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10న రాబోతున్న 'స్వయంభూ'పై భారీ అంచనాలు ఉన్నాయి. గ్రాఫిక్స్ కోసం తీసుకున్న ఈ ఎక్స్‌ట్రా టైమ్ సినిమాకు ఏ రేంజ్ లో హెల్ప్ అవుతుందో చూడాలి. నిఖిల్ తన కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో తీస్తున్న ఈ మూవీ, తన డిలే సెంటిమెంట్ ను కంటిన్యూ చేస్తూ మరోసారి రికార్డులు తిరగరాయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ వారియర్ కథ ఏప్రిల్ లో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com